తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4

సంచిక : 11

పేజీలు - 8

వెల- రూ 5:00

prajamantalu.com

# ప్రజా మంటలు

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ఆదివారం 28, మే 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri




## కర్నాటకలో కేబినేట్ విస్తరణ

- 24 మందికి కొత్తగా చోటు
- రాజ్‌భవన్‌లో 24మంది మంత్రుల ప్రమాణం
- మంత్రులకు శాఖలు కేటాయించిన సిఎం సిద్ధరామయ్య
- డికె శివకుమార్‌కు జలవనరుల శాఖ కేటాయింపు

2లో





## కేజ్రీవాల్‌కు మద్దతుగా

# దేశవ్యాప్త ఉద్యమం

- ఢిల్లీపై పెత్తనం కోసమే ఆర్డినెన్స్
- సుప్రీం తీర్పును తుంగలో తొక్కిన కేంద్రం
- కేజ్రీవాల్‌ను ఎదుర్కోలేక గవర్నర్లతో పెత్తనం
- ఆర్డినెన్స్ ఉపసంహరించే వరకు పోరాటం
- బిజెపికి కర్నాటకలో కర్రుకాల్చివాత పెట్టారు
- మీడియా సమావేశంలో మోడీ ప్రభుత్వంపై కెసిఆర్ ఆగ్రహం

హైదరాబాద్,మే27(ప్రజా మంటలు): ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం ముప్పు తిప్పలు పెడుతోందని సిఎం కేసీఆర్ ఆరోపించారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో కేంద్ర బీజేపీ బీజేపీ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. ఎమర్జెన్సీపై బీజేపీ నేతలకు విమర్శించే నైతిక హక్కులేదని, ఇప్పుడు వారి తీరు అలాగే ఉందన్నారు. వారు అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ ప్రగతిభవన్ లో తెలంగాణ సీఎం కేసీఆర్‌తో ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం ప్రగతి భవన్‌లో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌లతో కలసి కేసీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. లోక్ సభలో,రాజ్యసభలో తమ శక్తిని ఉపయోగించి.. ఢిల్లీపై పెత్తనం కోసం కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను వెనక్కి తీసుకునేలా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేంద్రం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు అరవింద్ కేజ్రీవాల్‌కు తమ మద్దతు ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో ఢిల్లీలో రెండు వింత ఘటనలు చూశాం. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ ఎంత పాపులర్ అనేది దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా తెలుసునన్నారు. అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలో సోషల్ ఉద్యమంతో వచ్చిన పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ. కేజ్రీవాల్ నాయకత్వంలో అప్రతిహతంగా మూడు పర్యాయాలు ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కానీ కేంద్రం ఉద్దేశపూర్వకంగా ఆప్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆప్ స్పష్టమైన మెజార్టీతో విజయం సాధించింది. అయితే ఒకటిగా ఉన్నదాన్ని మూడుగా చేసినా, కేంద్రం కుయుక్తులు చేసినా బీజేపీని తిరస్కరించిన ప్రజలు ఆప్ ను గెలిపించారు. మేయర్ ను ప్రమాణస్వీకారం చేయకుండా కేంద్రం అడ్డుకుందని మండిపడ్డారు. చివరకు సుప్రీంకోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుంటే కానీ మేయర్ ను ప్రమాణ స్వీకారం చేయించే పరిస్థితి మిగతా... 2లో

## ఆర్డినెన్స్‌లతో ప్రభుత్వాన్ని అడ్డుకుంటున్నారు

- ఇది ఢిల్లీ సమస్య కాదు.. దేశ ప్రజల సమస్య
- అధికారాలను తమ గుప్పిట్లో పెట్టుకోవాలన్న దురాలోచన
- మోడీ సర్కార్ తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్

హైదరాబాద్,మే27(ప్రజామంటలు): ఢిల్లీ పరిపాలనను అడ్డుకుంటూ కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను సీఎం అరవింద్ కేజ్రీవాల్ తప్పుపట్టారు. ఇది ఢిల్లీ సమస్య కాదు..ప్రజల సమస్య అని పేర్కొన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కెసిఆర్‌తో కలసి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీకి సహకారం అందించిన తెలంగాణ సీఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీ ప్రజల తరపున తాను ధన్యవాదలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. మిగతా... 2లో

## కొత్త పార్లమెంట్ భవనం ఎందుకో?

- చరిత్రను మార్చేస్తున్న అధికార పార్టీ
- నీతి ఆయోగ్ సమావేశం,పార్లమెంట్ ప్రారంభోత్సవాలు అర్థం లేనివి
- బీహార్ సిఎం నితీశ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు



పాట్నా,మే27(ప్రజా మంటలు): ఢిల్లీలో కొత్త పార్లమెంట్ భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్న సందర్భంగా బీహార్ సిఎం నితీశ్ కుమార్ విమర్శలు గుప్పించారు. ప్రారంభోత్సవాన్ని దాదాపు19 పార్టీలు బహిష్కరించాయి. రాష్ట్రపతి చేత కాకుండా ప్రధాని ఎందుకు ప్రారంభిస్తున్నారని ఇప్పటికే విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. మిగతా... 2లో



## నేడే నూతన పార్లమెంట్..

# ఆవిష్కృతం

- అట్టహాసంగా ప్రారంభించనున్న ప్రధాని మోడీ
- విపక్షాల బహిష్కరణ పిలుపులో అర్థంలేదన్న కమలహాసన్
- ఎవరు ప్రారంభిస్తారన్నది సమస్య కాదన్న గులాంనబీ ఆజాద్
- రాష్ట్రపతి ముర్ముపై వ్యాఖ్యలు..కేజ్రీవాల్, ఖర్గేలపై కేసు

న్యూఢిల్లీ,మే27(ప్రజా మంటలు): కొత్త పార్లమెంటు భవన ప్రారంభోత్సవం నేడు అట్టహాసంగా జరుగనుంది. 28వ తేదీన కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. నూతన పార్లమెంటు భవనాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా అంగరంగ వైభవంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. వీటిలో భాగంగా లోక్‌సభ సభాపతి ఆసనం వద్ద రాజదండాన్ని ప్రతిష్ఠిస్తారు. కాంగ్రెస్ సహా దాదాపు 20 ప్రతిపక్ష పార్టీలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరి స్తుండగా, తెదేపా, మిగతా... 2లో



## నేనెంతో అదృష్టవంతుణ్ణి

- రెండు పార్లమెంటులను చూసే భాగ్యం కలిగింది
- హోంమంత్రి అమిత్ షా ట్వీట్

న్యూఢిల్లీ,మే27(ప్రజా మంటలు): కొత్త పార్లమెంటు భవనం ప్రారంభోత్సవ తరుణంలో తనను తాను అదృష్టవంతుడుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అభివర్ణించుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పాత, కొత్త పార్లమెంటులకు తాను ప్రజా ప్రతినిధిగా ఉండటం తన అదృష్టమని శనివారంనాడు ట్వీట్ చేశారు. కొత్త పార్లమెంటు భవనం వింత శోయగాలతో ముస్తాబుకావడంతో యావద్దేశం చాలా సంతోషంగా ఉంది. మన దేశ సంస్కృతి, ఆధునికత్వానికి ఇదొక గొప్ప ఉదాహరణ. పాత పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తుండటం, మిగతా... 2లో

# అప్పులకుప్పగా తెలంగాణ

- నీతి ఆయోగ్‌కు వెళ్లకుండా ఏం చేస్తున్నట్లు
- 111జీవో రద్దుతో హైదరాబాద్‌కు ముప్పు
- అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- హామీలు విస్మరించినందుకు ఎన్నిసార్లు తల నరుక్కోవాలి
- మీడియా సమావేశంలో కెసిఆర్‌పై కిషన్ రెడ్డి విమర్శలు




హైదరాబాద్,మే27(ప్రజా మంటలు): నీతి ఆయోగ్ కు దూరంగా ఉన్న సీఎంలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నీతి ఆయోగ్ కంటే కేసీఆర్ కు ముఖ్యమైన పనేముందని ప్రశ్నించారు. నీతి ఆయోగ్ సమావేశానికికు వెళ్లకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణలో పేదరికం లేనట్లుగా కేసీఆర్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి అభివృద్ధి చేశామని గొప్పలు చెబుతున్నారని మండిపడ్డారు. కేంద్రాన్ని, ప్రధానిని విమర్శించడమే కేసీఆర్ పనిగా పెట్టుకున్నారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. అన్ని రాష్ట్రాలను ఏకం చేసుకుని మోడీ ముందుకెళ్తున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చిండని.. ఆదాయానికి మించి అప్పులు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో భూములు అమ్మితేగానీ ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. రైతుల సమస్యలను కేసీఆర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పిల్లలు పుట్టినా కళ్యాణ లక్ష్మీ డబ్బులు అందడం ఇంత వరకు అందడం లేదన్నారు. పాత అప్పుల వడ్డీలకు సంవత్సరానికి 20 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 3.50 లక్షల కోట్ల అప్పు ఉందని.. బడ్జెట్ యేతర అప్పులు కలుపుకుంటే 6 లక్షల కోట్ల అప్పు ఉందని తెలిపారు. అయినా మిగతా... 2లో

## రాష్ట్ర ఏర్పాటు దశాబ్ది ఉత్సవాల ఏర్పాటు సమీక్ష



జగిత్యాల మే27 (ప్రజా మంటలు): జూన్ 2వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరగనున్న తెలంగాణ రాష్ట్ర దశబ్ది ఉత్సవాల కార్యాచరణ పై జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ యాస్మిన్ భాషా అధ్య క్షతన, సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధ్వ ర్యంలో జరిగిన జగిత్యాల జిల్లా స్థాయి ప్రజాప్రతి నిధుల, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జెడ్పీ చైర్ పర్సన్ శ్రీమతి దావ వసంత సురేష్ గారు,ఎమ్మెల్యేలు డా సంజయ్ కుమార్ గారు,సుంకే రవిశంకర్ గారు,ఎస్పీ భాస్కర్ గారు,అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత గారు,మంద మకరంద్ గారు,గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా.చంద్రశేఖర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి,రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు చీటీ వెంకట్ రావు, జెడ్పీటీసీలు,ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాడి





# మార్కెట్‌లోకి విజయ బ్రాండ్ పల్లీనూనె

- విడుదల చేసిన మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,మే27(ప్రజా మంటలు): విజయ బ్రాండ్ పల్లీ నూనెను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి



శనివారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కల్తీ లేని ఉత్పత్తులు ఉత్పత్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విజయ బ్రాండ్ నుంచి నాణ్యమైన వంట నూనెలు అందిస్తున్నామని చెప్పారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఉత్పత్తులు ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచెర్ల రామకృష్ణారెడ్డి, ఎండీ సురేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. నాణ్యమైన వంట నూనెల తయారీపై ఆయిల్ ఫెడ్ దృష్టి పెట్టిందన్నారు. వేరుశెనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు, కొబ్బరి, రైస్ బ్రాన్, పామాయిల్, గానుగ నూనెలను ఆయిల్ ఫెడ్ ఉత్పత్తి చేస్తుందని పేర్కొన్నారు. విజయ బ్రాండ్ ఉత్పత్తులను అందరూ ఆదరించాలని కోరారు. శుద్ధమయిన ఆహారాన్ని ఎంపిక చేసుకునే అవకాశం మన చేతుల్లోనే ఉందన్నారు. హైదరాబాద్ నగరంలోని అన్ని రైతుబజార్లలో విజయ ఔట్ లెట్లు ఏర్పాట్లు చేస్తామని మంత్రి నిరంజన్ రెడ్డి ప్రకటించారు. మొత్తం 33 జిల్లాకేంద్రాలలో ఔట్ లెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో ఔట్ లెట్లు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. సిద్దిపేట, వనపర్తి జిల్లాలో వచ్చే జూన్ నెలలో ప్రారంభిస్తామన్నారు.



## పచ్చని పంటలతో

# పాలమూరు కళకళ

- కరువును తరిమికొట్టిన ఘనత కెసిఆర్‌దే
- జడ్చర్లలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభంలో హరీష్ రావు

మహబూబ్‌నగర్,మే27(ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి పాలమూరు జిల్లా.. పచ్చని పంటలతో కళకళలాడుతోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఉంటే ఈ అభివృద్ధి సాధ్యమయ్యేది కాదన్నారు. కరువును తరిమికొట్టి.. వలసలను వాపస్ తీసుకొచ్చిన కేసీఆర్ వెంటే ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు ఉన్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14కు 14 స్థానాల్లో ఎగిరేది గులాబీ జెండానే అని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. జడ్చర్ల మండల కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. 2018లో లక్ష్మారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేశారని, కరోనా వల్ల కొంత ఆలస్యమైందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పుడు సకల సౌకర్యాలతో ఈ ఆస్పత్రిని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రేవంత్ రెడ్డికి అబద్ధాలు చెప్పడం అలవాటై పోయిందన్నారు. మిగతా... 2లో

# కేజ్రీవాల్‌కు మద్దతుగా దేశవ్యాప్త ఉద్యమం

మొదటిపేజీ తరువాయి..
లేదన్నారు. రెండు జాతీయ పార్టీలను మట్టి కరిపించి భారీ మెజార్టీతో అరవింద్ కేజ్రీవాల్ మూడు సార్లు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. అనుకున్నట్లుగానే భారీ మెజార్టీతో ఆప్ విజయం సాధిస్తే ఓర్వలేక కేంద్ర ప్రభుత్వం లెఫ్టినెంట్ గవర్నర్‌ను వీళ్ల నెత్తిమీద పెట్టి కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తుందని కెసిఆర్ కేంద్రాన్ని విమర్శించారు. సుప్రీంకోర్టును ఆప్ ఆశ్రయిస్తే.. 5గురు సభ్యుల ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వం కిందనే అధికారులు తిరస్కరించారని కేసీఆర్ గుర్తుచేశారు. ఆ మూడు ఎన్నికల్లోనూ ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీకి ఢిల్లీ ప్రజలు మరోసారి తగిన బుద్ధి చెబుతారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ఇకనైనా తమ ఆలోచనను మార్చుకుని, ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేలా తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ను వెనక్కి తీసుకోవాలని లేకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని కేసీఆర్ దండాలు పెట్టినా కూడా కర్ణాటక ప్రజలు బీజేపీని తిరస్కరించారు. ఇలాంటి పరిణామాలు చూసి కూడా మోదీకి సర్కార్‌కు బుద్ధి రాలేదు. అండమాన్ పాలనకు, ఢిల్లీ పాలనకు చాలా తేడా ఉంది. త్వరలో దేశం మొత్తం కూడా బీజేపీకి గుణపాఠం చెప్పడున్నారు. ఢిల్లీ ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని ప్రధానిని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పుకే విలువ లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని





పనిచేయాలని ఆదేశించింది. గెలిచిన ప్రభుత్వాన్ని పనిచేయకుండా అడ్డుకోవడమే అరాచకం అంటే, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా ఆర్డినెన్సులు తీసుకొస్తున్న కేంద్రం తీరు చూస్తే ఎమర్జెన్సీ రోజులు గుర్తుకొస్తున్నాయని కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ప్రధాని ఇందిరాగాంధీ అమలు చేసిన ఎమర్జెన్సీ తరహాలో ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేసీఆర్ ఆరోపించారు. వరుసగా మూడు ఎన్నికల్లో బీజేపీ సహా జాతీయ పార్టీలను ప్రజలు హెచ్చరించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం కిందనే అధికారులు పని చేయాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని ప్రధాని నరేంద్ర మోదీ పాటించకపోతే ఎలా? అని తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. అలంకారప్రాయమైన గవర్నర్ వ్యవస్థతో ఏదో చేయాలనుకుంటున్నారని విమర్శించారు. ఈ దేశాన్ని ఎక్కడికి తీసుకుపోతున్నారు. ఏం చేయదలుచుకున్నారని కేసీఆర్ అడిగారు. కర్ణాటకలో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా.. బీజేపీకి బుద్ధి రాలేదని ధ్వజమెత్తారు. మోదీ వంగి వంగి కాలరాయడమే అని మండిపడ్డారు. ఆర్డినెన్స్ పాస్ కాకుండా చేసేందుకు లోక్‌సభ, రాజ్యసభలో అడ్డుకుంటామని స్పష్టం చేశారు. మోదీ పాలనలో ఎమర్జెన్సీ కంటే దుర్మార్గమైన రోజులను చూస్తున్నామని తెలిపారు. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా స్వతంత్రంగా పని చేసుకునేలా కేంద్రం సహకరించాలి. అలంకారప్రాయమైన గవర్నర్ పదవులతో రాష్ట్ర పాలనను అడ్డుకోవడం దుర్మార్గం అని కేసీఆర్ మండిపడ్డారు.

# ఆర్డినెన్స్‌లతో ప్రభుత్వాన్ని అడ్డుకుంటున్నారు

మొదటిపేజీ తరువాయి..
2015 ఫిబ్రవరిలో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. మేలో మోదీ సర్కార్ ఓ నోటిఫికేషన్ తెచ్చి తమ ప్రభుత్వాన్ని కూల్చారన్నారు. సర్వీస్ సంబంధిత విషయాల్లో గతంలో షీలా దీక్షిత్ వద్ద కంట్రోల్ ఉండేదన్నారు. తాము 8 ఏళ్లు పోరాటం చేశామని, మే 11వ తేదీన ఢిల్లీ ప్రజల తరపున అనుకూల తీర్పు వచ్చిందని, కానీ 8 రోజుల్లో వ్యతిరేక ఆర్డినెన్స్ తీసుకువచ్చిన ఢిల్లీ అధికారాల్ని మోదీ సర్కార్ లాగేసుకు న్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పక్కనపెట్టేసి ఆర్డినెన్స్ తేవడం అంటే న్యాయం కోసం ప్రజలు ఎక్కడికి వెళ్తారని ఆయన అడిగారు. ఢిల్లీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ప్రజాస్వామ్యానికి విఘాతం అని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకే ప్రధాని మోదీ ఆర్డినెన్స్ తీసుకొచ్చారని మండిపడ్డారు. కేంద్రం ఆర్డినెన్స్ ఢిల్లీ ప్రజలకు అవమానం అని చెప్పారు. కేంద్రం ఆర్డినెన్స్ తో ఢిల్లీ సీఎంగా తాను కీలక నిర్ణయాలు తీసుకోలేకపోతున్నానని.. తక్షణమే ఆర్డినెన్స్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల బదిలీలన్ని ఢిల్లీ ప్రభుత్వ ఆమోదంతోనే జరగాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినా కేంద్రం ఆర్డినెన్స్ తెచ్చిందని మండిపడ్డారు. దేశంలో కేంద్ర ప్రభుత్వ ఆగడాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయని కేజ్రీవాల్ ఆగ్ర హం వ్యక్తం చేశారు. బీజేపీయేతర ప్రభుత్వాలను కేంద్రం చాలా ఇబ్బంది పెడుతోందన్నారు. రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ప్రభుత్వాలను పడగొడుతున్నారని మండిపడ్డారు. గవర్నర్లతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో భయంకరపరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఢిల్లీ ప్రజలను ఇది అవమానించడమే అన్నారు. ఇది ఢిల్లీ ప్రజల సమస్య కాదు, ఇది దేశ ప్రజల సమస్య అన్నారు. సీబీఐ, ఈడీలతో బెదిరిస్తూ.. ప్రభుత్వాలను కూల్చివేస్తున్నారని బీజేపీపై కేజీ ఆరోపణలు చేశారు. నాన్ బీజేపీ సర్కార్లను కూల్చివేయడం బీజేపీకి అలవాటు అయ్యిందన్నారు. దేశవ్యాప్తంగా తాను ప్రజల తరపున తిరుగుతున్నట్లు ఆయన చెప్పారు. ఒకవేళ గవర్నరే పాలన చేయాలనుకుంటే, అప్పుడు ముఖ్యమంత్రిని ఎన్నుకోవాల్సి అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. నాన్ బీజేపీ పార్టీలు అన్ని ఒక్కటి అయితేనే బీజేపీ ఢీకొట్టగలమన్నారు. దేశ ప్రజల్లో విశ్వాసం నింపాలన్నారు. ఆజాదీని రక్షించుకోవాలంటే మోదీని ఓడించాలని కేజీ పిలుపునిచ్చారు.దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తాము పోరాటం చేస్తున్నట్లు పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ సింగ్ తెలిపారు. నీతి ఆయోగ్ మీటింగ్ ఇవాళ ఢిల్లీలో జరుగుతోందని, కానీ అక్కడ చేసేది ఏమీలేదని, అందుకే తాము ఆ మీటింగ్‌ను బహిష్కరించినట్లు ఆయన చెప్పారు. మీటింగ్‌లను తమకు నచ్చినట్లే నిర్వహిస్తున్నారని భగవంత్‌మాన్ విమర్శించారు.

# కొత్త పార్లమెంట్ భవనం ఎందుకో?

**మొదటిపేజీ తరువాయి..**
అసలు కొత్త పార్లమెంట్భవనం అవసరం ఎందుకని బీహార్ సీఎం నితీశ్ కుమార్( ప్రశ్నించారు. పాత పార్లమెంట్ బిల్డింగ్ చరిత్రాత్మకమైందని,అయితే అధికారంలో ఉన్న వ్యక్తులు చరిత్రను మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఢిల్లీలోజరుగు తున్న నీతి ఆయోగ్ సమావేశానికి కానీ, రేపు జరనున్న పార్లమెంట్ బిల్డింగ్ ప్రారంభోత్సవ వేడుకకు హాజరుకావడంలో ఎటువంటి మతిలేని చర్య అని నితీశ్ అన్నారు.

దేశ చరిత్రను అధికారంలో ఉన్న పెద్దలు మార్చేస్తున్నారంటూ పదేపదే నేను చెబుతూనే ఉన్నాను. ప్రస్తుతం ఉన్న పార్లమెంటు దేశ చరిత్రలో ఒక భాగం. ఈ ప్రభుత్వం కొత్త పార్లమెంటు భవనం నిర్మించాలని తహతహలాడింది. దేశ చరిత్రను మార్చాలనే ఉద్దేశమే ఇందుకు కారణం‘ అని నితీష్ అన్నారు. శనివారంనాటి నీతి ఆయోగ్ సమావేశానికి కానీ, ఆదివారం కొత్త పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి కానీ హాజరుకావడం అర్థం లేదని నితీష్ వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా కొత్త పార్లమెంటు భవనం ప్రారంభి ంచాలన్న డిమాండ్‌తో 28వ తేదీ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు జేడీయూ ఇప్పటికే ప్రకటించింది.

పార్లమెంటరీ వ్యవస్థలో రాష్ట్రపతికి కీలక పాత్ర ఉందని, ద్రౌపది ముర్ము అత్యున్నత రాజ్యాంగ పదవిని నిర్వహి స్తున్నారని, ఆయన మోదీ ఆహ్వానించి, ఆమె చేతుల మీదుగా పార్లమెంటు భవనాన్ని ప్రారంభించాలని జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేషఅ సింగ్ కుష్వాహ ఇటీవల అన్నారు. అయితే నైతిక విలువలకు తిలోదకాలిస్తూ ప్రధాని స్వయంగా తానే పార్లమెంటు కొత్త భవనాన్ని ప్రారంభించబోతున్నా రంటూ విమర్శలు గుప్పించారు.

# కర్నాటకలో కేబినేట్ విస్తరణ

**బెంగళూరు,మే27(ప్రజా మంటలు):** కర్ణాటకలో కొత్తగా ఏర్పాడిన సిద్ధరామయ్య సర్కార్ తన మంత్రి వర్గాన్ని విస్తరించారు. బెంగళూరులోని రాజ్‌భవన్‌లో 24 మంది కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. కర్ణాటక ప్రభుత్వంలో 34మంది మంత్రులు ఉండొచ్చు. వీరిలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో సహా 10 మంది మే 20న ప్రమాణ



స్వీకారం చేసిన విషయం తెలిసిందే. వారం రోజుల తర్వాత క్యాబినెట్ విస్తరణ జరిగింది. శనివారం ఉదయం 11 గంటల 45 నిమిషాలకు రాజ్‌భవన్‌లో 24 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. కొత్త మంత్రులైన ఎమ్మెల్యేల జాబితాలో దినేష్ గుండూరావు, కృష్ణ బైరేగౌడ, ఈశ్వర్ ఖండ్రే, శివరాజ్ తంగడి, ఆర్‌బి.తిమ్మాపూర్, బి.నాగేంద్ర, లక్ష్మీ హెబ్బా ల్కర్, మధు బంగారప్ప, డి. సుధాకర్, చెలువరాయ స్వామి, మంకుల్ వైద్య, ఎంసీ, సుధాకర్, రహీం ఖాన్, సంతోష్ లాడ్, కెఎన్.రాజన్న, కె. వెంటకేశ్, హెచ్‌సీ మహదేవప్ప, బైరతి సురేష్ ఉన్నారు. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 24 మందిలో తొమ్మిది మంది తొలిసారిగా ఎన్నికైన వారు ఉండడం విశేషం. అందులో ఒక మహిళా ఎమ్మెల్యే కూడా ఉన్నారు. సిద్ధరామయ్య మంత్రివర్గంలో ఆరుగురు వొక్కలిగలు, ఎనిమిది మంది లింగాయత్ సామాజిక వర్గానికి చెందినవారు ఉన్నారు. ముగ్గురు మంత్రులు షెడ్యూల్డ్ కులాలు, ఇద్దరు షెడ్యూల్డ్ తెగలు, ఐదుగురు ఇతర వెనుకబడిన వర్గాల వారికి అవకాశం దక్కింది. క్యాబినెట్‌లో బ్రాహ్మణులకు కూడా ప్రాతినిధ్యం లభించింది. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరు ఎమ్మెల్యేలకు సముచిత గౌరవం ఇవ్వడంతో పాటు కుల, ప్రాంతాల వారీగా ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సీఎం సిద్ధరామయ్య మంత్రివర్గ విస్తరణలో సమతూకం పాటించారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య.. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు ఇతర మంత్రులందరికీ శాఖలను కేటాయించారు. మొత్తం 34 మంది మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తయ్యింది. అందులో ముఖ్యమంత్రితోపాటు, ఉప ముఖ్యమంత్రి, 32 మంది ఇతర మంత్రులు ఉన్నారు. అయితే, సీఎం సిద్ధరామయ్య ఆర్థికశాఖను మాత్రం తన దగ్గరే అట్టిపెట్టుకున్నారు. ఆర్థిక శాఖతోపాటు వ్యక్తిగత, పరిపాలనా సంస్కరణల శాఖ, ఇంటెలిజెన్స్ శాఖ, సమాచార శాఖ, ఎవరికీ కేటాయించని ఇతర చిన్నచిన్న శాఖలు ఆయన దగ్గర ఉన్నాయి. ఇక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు భారీ, మధ్యతరహా నీటి పారుదల శాఖలను కేటాయించారు. దాంతోపాటు బెంగళూరు నగర అభివృద్ధి శాఖను కూడా డీకేకు కట్టబెట్టారు. ఇక సీనియర్ నేతలు జీ పరమేశ్వరకు హోంశాఖ (ఇంటెలిజెన్స్ మినహా), హెచ్‌కే పాటిల్‌కు న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ, దినేశ్ గుండూరావుకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, కృష్ణ బైరె గౌడకు రెవెన్యూ శాఖ, ఎన్ చలువ నారాయణస్వామికి వ్యవసాయ శాఖ, కేజే జార్జ్‌కు విద్యుత్ శాఖ, కేహెచ్ మునియప్పకు ఆహార, పౌరసరఫరాల శాఖ, ఎంబీ పాటిల్‌కు పరిశ్రమల శాఖను, రామలింగప్ప రెడ్డికి రవాణా శాఖ, ప్రియాంక్ ఖర్గేకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ, బీ నాగేంద్రకు యువజన వ్యవహారాలు, క్రీడా శాఖలను కేటాయించారు.

# టీఎస్‌పీఎస్‌సీ కేసును నీరుగార్చే కుట్ర

## సిఎం కార్యాలయం ప్రమేయం ఉంది: ప్రవీణ్

**హైదరాబాద్,మే27(ప్రజా మంటలు):** టీఎస్ పీఎస్ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. పేపర్ లీక్ కేసును కేటీఆర్ తప్పుదోవ పట్టించే యత్నం చేశారని ఆరోపించారు. కేసులో కొందరిని తప్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు. టెన్త్ పేపర్ లీకేజీలో చూపిస్తున్న శ్రద్ధ పబ్లిక్ సర్వీస్కమిషన్ విషయంలో చూపడం లేదన్నారు. సీఎం కార్యాలయమే లీక్ కుంభకోణం జరిపించిందని ఆరోపించారు. పేపర్ లీక్ కుంభ కోణంలో టీఎస్ పీఎస్ సీ చైర్మన్ సహా అందరికీ సంబందం ఉందన్నారు ప్రవీణ్ కుమార్. సీఎం ఆయన కుటుంబం కోసమే ఇంటలీజెన్స్ పని చేస్తోందని విమ ర్శించారు. తెలంగాణ దశాబ్ది ఉత్స వాలను తాము బహిష్కరిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఇవాళ రైతులు ధాన్యం అమ్ముకోవడానికి పడిగాపులు గాస్తున్నారని ధ్వజమెత్తారు. రైస్ మిల్లర్ల దోపిడికి తెరలేపింది తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. ఇవాళ ఇసుక దోపిడికి లారీలు దొరుకుతున్నాయి కానీ.. రైతుల ధాన్యం కొనుగోలు చేయడానికి లారీలు దొరుకుతలేవని అన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కేసీఆర్ నాశనం చేశారని ఆరోపించారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. జూన్ 20న జరిగే విద్యాదినోత్సవాన్ని కూడా బహిష్కరిస్తున్నా మని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

# పచ్చని పంటలతో పాలమూరు కళకళ

**మొదటిపేజీ తరువాయి..**
మహబూబ్‌నగర్‌కు మెడికల్ కాలేజీ తెచ్చిన ఘనత లక్ష్మారెడ్డిదే అని పేర్కొన్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. గద్వాల, నారాయణపేట జిల్లాల్లో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసుకోబోతున్నామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. కరువు లేదు. వలసలు ఆగిపోయాయి. ఆకలి చావులు లేవు అని మంత్రి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కృషితో పాలమూరు పచ్చని పైరుతో కళకళలాడు తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రకృతి వైపరీత్యంతో సమానం అని విమర్శించారు. కష్టపడి తెలంగాణ తెచ్చుకున్నాం.. ఇష్టపడి అభివృద్ధి చేసుకున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొనకుంటే.. ఈ రాష్ట్ర ప్రజలను అవమానించినట్లేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉద్యమంలో కలిసి రాలేదు.. ఇప్పుడు అభివృద్ధిలో కూడా కలిసి రావడం లేదని ధ్వజమెత్తారు.

# అప్పలకుప్పగా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి..**
కేసీఆర్ అప్పుల దాహం తీరడం లేదన్నారు. 111 జీవో రద్దుతో హైదరాబాద్‌కు ముప్పు వాటిల్లిందన్నారు. మాట తప్పితే తల నరుక్కుంటానన్న కేసీఆర్.. కొన్ని వేలసార్లు తల నరుక్కోవాల్సి వచ్చేదన్నారు. పార్టీ ఆఫీసులకు కేసీఆర్ స్థలం ఇస్తారు కానీ పేదలకు ఇవ్వడం లేదన్నారు. పార్టీ ఆఫీసుల పేరుతో కాంగ్రెస్ పార్టీకి 10 ఎకరాల భూమి కేటాయించారు కానీ.. దళితలకు మూడెకరాలు ఇవ్వడం లేదన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కేసీఆర్ టార్గెట్‌గా తీవ్ర విమర్శలు గుప్పించారు.2014లో సీఎంగా ప్రమాణస్వీకారం చేయకముందే కేసీఆర్ తల నరుక్కోవాలని వ్యాఖ్యానించారు. దళిత సీఎం, మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు సహా కొన్ని వందల సార్లు తెలంగాణ సీఎం కేసీఆర్ మాట తప్పారని విమర్శించారు. తెలంగాణకు కేంద్రం సాయంపై చర్చకు సిద్ధమని కేసీఆర్‌కు కిషన్ రెడ్డి సవాలు విసిరారు. తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కంపెనీగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో దేశవ్యాప్తంగా డబ్బులు పంచడం కోసమే 111 జీవో రద్దు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు 111 జోవో పరిధిలో వందలాది ఎకరాలున్నాయన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కలిసి మాట్లాడుకుని కార్యాలయాలకు భూములు తీసుకున్నారని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబానికి భూ దాహం, అప్పుల దాహం తీరటం లేదని ధ్వజమెత్తారు. నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం కేసీఆర్ హాజరుకావ పోవటం తెలంగాణకు తీవ్ర నష్టం అన్నారు. నీతి ఆయోగ్ సమావేశం కంటే కేసీఆర్‌కు ముఖ్యమైన పని ఏముందో చెప్పాలని డిమాండ్ చేశారు. 30 వేల ఎకరాలను అమ్మటానికి కేసీఆర్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. 111 జీవో రద్దుతో ఎప్పటికైనా హైదారాబాద్‌కు ముప్పు తప్పదని హెచ్చరించారు. 111 జీవో ఎత్తివేస్తే హైదరాబాద్ ఏమైపోతుందో ప్రభుత్వం ఆలోచన చేయాలి. అప్పులపై తెలంగాణ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి. 135 ఏళ్ల చరిత్ర కలిగిన వరంగల్ జైలు భూములు తాకట్టు పెట్టారని వార్తలొస్తున్నాయి. నీ తెలంగాణ.. నా తెలంగాణ కాదు.. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమని కేసీఆర్ గుర్తుంచుకోవాలి. గుణాత్మకమైన మార్పు తీసుకొస్తానన్న కేసీఆర్ ఇంట్లో కూర్చున్నారు. కేంద్రాన్ని, ప్రధానిని ఆడిపోసుకోవటం తప్ప కేసీఆర్ చేసిందేమీ లేదు. మహారాష్ట్రలో తలకుమాసిన వాళ్లు మాత్రమే బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. రైతులకు తెలంగాణ ప్రభుత్వం 50 వేల కోట్లు బకాయిలు చెల్లించాలి. కేసీఆర్ హయాంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి. మోదీ సమర్థ నాయకత్వం వలనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# నేనెంతో అదృష్టవంతుణ్ణి

**మొదటిపేజీ తరువాయి..**
ఇప్పుడు ఇదే హోదాలో కొత్త పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించనుండటం, రెండుసార్లూ ప్రధాన మోదీ నాయకత్వంలో పనిచేయడం నా అదృష్టం అని అమిత్‌షా ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. తన ట్వీట్‌కు ఎన్నో ప్రత్యేకతలతో కూడిన పార్లమెంటు భవనం వీడియోను ఆయన షేర్ చేశారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండుసార్లు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి గెలుపొంది ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తుండగా, అమిత్‌షా తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లోని గాంధీనగర్ నియోజక వర్గం నుంచి గెలుపొంది లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈనెల 28న పార్లమెంటు కొత్త భవనాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు.

## నేడే నూతన పార్లమెంట్..

# ఆవిష్కృతం

**మొదటిపేజీ తరువాయి..**
వైకాపా, ఎస్ఏడీ, బీజేడీ వంటి ఎన్డీయేయేతర పార్టీలు హాజరవుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని బహిష్కరించడం తగదని నటుడు కమలహాసన్ విపక్షాలను కోరారు. ఇది జాతీయ ఆనందానికి ప్రతీకగా గుర్తించాలన్నారు. తక్కువ సమయంలో పార్లమెంటు భవనాన్ని సిద్ధం చేయడం తేలికైన విషయం కాదని మాజీమంత్రి గులాం నబీ ఆజాద్ అన్నారు. ఈ నూతన భవనాన్ని ప్రధాన మంత్రి ప్రారంభించారా? రాష్ట్రపతి ప్రారంభించారా? అనేది ముఖ్యమైన విషయం కాదన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును బీజేపీ ఎన్నుకోలేదని కాదని, ప్రతిపక్షాలు ద్రౌపది ముర్ముకు అంత అనుకూలం అయితే, ఆమెకు వ్యతిరేకంగా రాష్ట్రపతి ఎన్నికల్లో ఎందుకు పోటీ పెట్టారని ప్రశ్నించారు. ఇకపోతే ఈ వివాదంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , ఇతర నేతలపై ఫిర్యాదు నమోదైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కులాన్ని ప్రస్తావిస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్న కారణంగా వీరిపై ఈ ఫిర్యాదు నమోదైంది. వీరు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వివిధ కమ్యూనిటీల మధ్య శత్రుత్వాన్ని పెంపెందించేందుకు, భారత ప్రభుత్వంపై అపనమ్మకాన్ని సృష్టించేందుకు ప్రయత్నించారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. దీంతో ఐపీసీ సెక్షన్ 121,153a,505,34 కింద వీరిపై ఫిర్యాదు నమోదైంది. కొత్త పార్లమెంటు భవనం ప్రారంభోత్స వానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకపోవ డంపై బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఇతర విపక్షాలు లక్ష్యంగా చేసుకున్నాయి. కాంగ్రెస్, ఆప్, తృణమూల్ సహా 20కి పైగా పార్టీలు తాము కొత్త పార్లమెంటు ప్రారంభోత్సవంలో పాల్గొనడం లేదని ప్రకటించాయి. ఈ మేరకు సంయుక్త ప్రకటన కూడా విడుదల చేశాయి. మరోవైపు నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాలను బహిష్కరించాలని నిర్ణయించిన ప్రతిపక్షాలకు ప్రముఖ నటుడు, మక్కల్ నీధి మయ్యమ్ పార్టీ చీఫ్ కమల్ హాసన్ ఓ సలహా ఇచ్చారు. రాజకీయ విభేదాలకు ఓ రోజు విరామం ప్రకటించాలని, ఈ కార్యక్రమాలను బహిష్కరించాలనే నిర్ణయాన్ని పునఃపరిశీలించి, జాతీయ ఐకమత్య సంబరంగా దీనిని మార్చాలని కోరారు. అదే సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఓ ప్రశ్నను సంధించారు. నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవాలకు రాష్ట్రపతి ఎందుకు హాజరు కాకూడదో చెప్పాలని నిలదీశారు. అలాగే నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించడం దేశానికి గర్వకారణమని తెలిపారు. అయితే ఇది రాజకీయంగా విభజనకు దారితీసిందని పేర్కొన్నారు. నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ఎందుకు హాజరుకాకూడదో దేశానికి చెప్పాలని డిమాండ్ చేశారు. దేశానికి అధిపతి అయిన రాష్ట్రపతి ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వామి కాకపోవ డానికి ఎటువంటి కారణం తనకు కనిపించడం లేదన్నారు. ప్రారంభోత్సవాన్ని బహిష్కరించిన ప్రతిపక్ష పార్టీలకు కూడా కమల్ హాసన్ హితవు పలికారు. రాజకీయ విభేదాలకు ఓ రోజు విరామం ఇవ్వవచ్చు నన్నారు. ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాలని తీసుకున్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. దేశ ఐకమత్యాన్ని చాటే సందర్భంగా ఈ కార్య క్రమాన్ని మార్చాలని కోరారు. భారత దేశ నూతన గృహంలో కుటుంబ సభ్యులంతా నివసించాలన్నారు. భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని తాను నమ్ముతానని తెలిపారు. అందుకే ఈ కార్యక్రమాన్ని బహిష్కరిం చేందుకు తీసుకున్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరుతున్నానని చెప్పారు. ఈ కార్యక్రమం పట్ల ఏమైనా అభ్యంతరాలు ఉంటే బహిరంగ వేదికలపై కానీ, నూతన పార్లమెంటులో కానీ లేవనెత్తవచ్చునని తెలిపారు. మనల్ని విభజించేవాటి కన్నా కలిపి ఉంచేవి ఎక్కువగా ఉన్నాయని గుర్తుంచుకోవాలని కోరారు. యావత్తు దేశం ఈ కార్యక్రమం కోసం ఎదురు చూస్తోందన్నారు. ప్రపంచం దృష్టి మనపై ఉందన్నారు. నూతన పార్లమెంటు భవనాన్ని మే 28న ప్రారంభించడం యావత్తు దేశానికి సంబరాలు చేసుకునే సందర్భమని తెలిపారు. ఈ చరిత్రాత్మక విజయానికి భారత ప్రభుత్వాన్ని అభినందించారు. దేశ ప్రయోజనాల కోసం తాను అందరితో కలిసి ఈ కార్యక్రమాన్ని సంబరంగా జరుపుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇది తనకు అత్యంత



గర్వకారణమైన విషయమని తెలిపారు. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఈ కార్యక్రమానికి ఆహ్వానించకపోవడం పట్ల, ఈ కార్యక్రమంలో ప్రతిపక్షాలను భాగస్వాములను చేయకపోవడం పట్ల తన అసమ్మతిని కొనసాగిస్తానని చెప్పారు. పార్లమెంటు ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపితేనే చట్టాలుగా మారుతాయన్నారు. పార్లమెంటు ఉభయ సభలను సమావేశపరచడానికి, వాయిదా వేయడానికి రాష్ట్రపతికే అధికారం ఉందన్నారు. పార్లమెంటు కార్యకలాపాల్లో రాష్ట్రపతి అంతర్భాగమని తెలిపారు. రాజీ ధోరణిని ప్రదర్శిస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలని మోదీని కోరారు. నూతన పార్లమెంటు అనేది కేవలం ఓ సాధారణ భవనం కాదని, చిరకాలం భారత దేశ ప్రజాస్వామ్య నిలయమని తెలిపారు. ఈ ఏమరుపాటు చరిత్రలో తీవ్ర తప్పిదంగా నమోదవుతుందని, దీనిని సరిదిద్దుకోవాలని మోదీని కోరారు. దీనిని సరిదిద్దుకుంటే రాజకీయ నాయకత్వంలో ఓ గొప్ప మైలురాయిగా నిలుస్తుందన్నారు. జమ్మూ-కశ్మీరుకు చెందిన డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ చీఫ్ గులాం నబీ ఆజాద్ శనివారం మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చిన తర్వాత 75 ఏళ్లలో దేశ జనాభా దాదాపు ఐదు రెట్లు పెరిగిందని, పార్లమెంటేరియన్ల సంఖ్య దాదాపు రెట్టింపు అయిందని చెప్పారు. ఈ నేపథ్యంలో నూతన పార్లమెంటు భవనం అవసరం చాలా ఉందన్నారు. ఈ భవనాన్ని నిర్మించడం చాలా అవసరమని, తప్పనిసరి అని చెప్పారు. ఇంత తక్కువ సమయంలో పార్లమెంటు భవనాన్ని సిద్ధం చేయడం తేలికైన విషయం కాదన్నారు. ఈ నూతన భవనాన్ని ప్రధాన మంత్రి ప్రారంభించారా? రాష్ట్రపతి ప్రారంభించారా? అనేది ముఖ్యమైన విషయం కాదన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును బీజేపీ ఎన్నుకోలేదని కాదని, ప్రతిపక్షాలు ద్రౌపది ముర్ముకు అంత అనుకూలం అయితే, ఆమెకు వ్యతిరేకంగా రాష్ట్రపతి ఎన్నికల్లో ఎందుకు పోటీ పెట్టారని ప్రశ్నించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల క్రితం తాను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేసినపుడు కొత్త పార్లమెంటు భవన నిర్మాణం గురించి కలలు కనేవారమని చెప్పారు. అప్పటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు, కేంద్ర మంత్రి శివరాజ్ పాటిల్, తాను దీని గురించి చర్చించామని చెప్పారు. దీని కోసం ఓ మ్యాపును కూడా తయారు చేశామన్నారు. అప్పట్లో తాము దీనిని నిర్మించలేకపోయామని చెప్పారు. అయితే ఇప్పుడు దీనిని నిర్మించడం చాలా మంచి విషయమని తెలిపారు.



## ఆర్టీసీ బస్సు, కారు ఢీ కొన్న ప్రమాదంలో మాజీ జడ్పీటీసీ మృతి

**హన్మకొండ మే 27 ( ప్రజామంటలు):** గీసుగొండ మండలం నర్సంపేట – వరంగల్ ప్రధాన రహదారిపై గంగదేవిపల్లి శివారులో ఆర్టీసీ బస్సు & కారు ఢీ కొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న పురుషోత్తం అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడు పురుషోత్తం మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి సోదరుడుగా గుర్తించారు. కాగా మృతుడు మహబూబా బాద్ జిల్లా కేసముద్రం మాజీ జడ్పీటీసీ అని సమాచారం. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురికి తరలించారు. ఇంకా ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి దంపతులకు సన్మానం చేసిన కవులు కళాకారుల ఐక్యవేదిక

**జనగామ మే 27 (ప్రజామంటలు):** సామాజిక, విద్యా వేత్త, ప్రజా వైద్యులు కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి స్వరూప సిల్వర్ జూబ్లీ వివాహక వేడుకల కార్యక్రమం జనగామలో శనివారం జిల్లా కవులు కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా శాలువలో సత్కారించి జ్ఞాపిక అంద



జేశారు. బిక్షపతి సైనికుడిగా దేశ రక్షణ సరిహద్దు ప్రాంతాలలో చేసిన సేవలను ఐక్యవేదిక బాధ్యులు కొనియాడారు. వైద్య, సామాజిక, విద్యా, కళా, సాహిత్య రంగాల్లో చేయూత, ప్రోత్సాహం, కృషి అనిర్వచనీయ మైనదని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్, జి.వై. గిరి పౌండేషన్ జి. కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక పెట్లోజు సోమే శ్వరాచారి, జనగామ రచయితల సంఘం అయిలా సోమనర్సింహచారి, సాయికిరణ్ మ్యూజికల్ చిలుమోజు సాయికిరణ్,ప్రముఖ కవులు గుగ్గిల్ల నర్సయ్య, సాంబరాజు యాదగిరి, కోడం కుమారస్వామి, పొట్టలో భాస్కర్, నక్క సురేష్, గడ్డం మనోజ్ కుమార్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, కొండ శ్రీనివాస్, టి. రామచంద్రం, కొట్టె శ్రీలత, చిటూరు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## పరేడ్ గ్రౌండ్ యోగా వేడుకల్లో మర్రి శశిధర్ రెడ్డి


**సికింద్రాబాద్ మే 27 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన ప్రపంచ యోగా డే కౌంట్ డౌన్ వేడుకల్లో భాగంగా



శనివారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, గవర్నర్ పాల్గొన్నారు. ఎంపీ డా. కే. లక్ష్మన్, మాజీ మంత్రి, మాజీ ఎన్.డీ.ఎమ్.ఏ. వైస్ ప్రెసిడెంట్ మర్రి శశిధర్ రెడ్డి యోగా లో పాల్గొని పలు ఆసనాలు వేశారు.

## పూర్తయిన న్యాక్ బృంద మూడు రోజుల పర్యటన

**హనుమకొండ మే 27 (ప్రజామంటలు):** కాకతీయ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల న్యాక్ బృంద పర్యటన పూర్తయిన సందర్భంగా పీర్ టీం చైర్మన్ ఆచార్య సుగం ఆనంద్ విశ్వవిద్యాలయ సెనెట్ హాల్ లో నిర్వహించిన ఎగ్జిట్ మీటింగ్ లో వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ కు రిపోర్ట్ సమర్పించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... “ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కలిగిన యూనివర్సిటీల్లో కాకతీయ యూనివర్సిటీ ఒక్కటీ అని, ఉన్నత విద్యలో విస్తృతమైన మార్పులు రాబోతున్న తరుణంలో విశ్వవిద్యాలయల పాత్ర చాలా ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రయివేటీకరణ పెద్దఎత్తున జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయం మనుగడ సాదించాలంటే మన సేవలను, బలాలును బహిరంగ పరచాల న్నారు. మూడవ రోజున కాకతీయ విశ్వవిద్యాలయ వివిధ విభాగాలు తో పాటు కామన్ ఫెసిలిటీస్, ఇతర వసతులు పరిశీలించారు. మరియు విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎగ్జిట్ మీటింగ్ లో వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ పీర్ టీం కు కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక పై పీర్ టీం సభ్యులలు, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస రావు, ఐక్యూ ఏసి డైరెక్టర్ ఆచార్య ఎస్. నరసింహ చారి పాల్గొన్నారు.




## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

### టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుమార్

**జనగామ మే 27 (ప్రజామంటలు):** ఉపాధ్యాయ, విద్యా రంగాల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ, మాటలతో మభ్యపెడుతుందని, ఆచరణ శూన్యమని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ విమర్శించారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హైద్రాబాద్ లో చేస్తున్న నిరసన దీక్షకు మద్దతుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్య క్షులు చంద్రశేఖర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంజిత్ కుమార్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో విద్యారంగం పట్ల ప్రభుత్వానికి సరైన దృక్పథం లేదని 8 సంవత్సరాలు అయినా ప్రమోషన్స్ లేవని, 5 సంవత్సారాలుగా బదిలీలు లేవని, కేవలం ఆర్థికపరమైన అంశంగానే చూస్తుంది తప్ప, విద్యలో నాణ్యత పెరుగుతుందనే ఆలోచన లేదని, మోడల్ స్కూల్స్ ప్రారంభం అయినప్పటి నుండి ఇప్పటివరకు ప్రమోషన్స్ కానీ బదిలీలు కానీ నిర్వహించలేదని విమర్శి ం చారు. వేతనాలు అందజేయడంలో కూడా అలసత్వం ప్రదర్శిస్తూ 10 నుండి 15 వరకు కూడా వేతనాలు రాని దుస్థితి నెలకొందని, ఉద్యోగులు దాచుకున్న సొమ్మును వారి అవసరాలకు ఇవ్వకుండా ఈ కుబేర్ లో పెండింగ్ లో పెడుతుందని వెంటనే మార్చ్ వరకు ఉన్న పెండింగ్ బిల్స్ అన్నింటినీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కెజిబివి, యుఆర్ఎస్, ఎస్ఎస్ లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యా రంగ వికాసం కొరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అనేక పర్యాయాలు ప్రాతినిధ్యాలు చేసిన స్పందించని ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారని, వారి దీక్షకు మద్దతుగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసనలు జరుగుతున్నాయని, ప్రభుత్వం మొద్దు నిద్రవీడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస రావు, కోశాధికారి సుధాకర్, జిల్లా కార్యదర్శులు చిక్కుడు శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, వివిధ మండలాల బాధ్యులు కనకయ్య, నాగరాజు నీలకంఠం, జంపయ్య, గోవర్ధన్ రెడ్డి, ఆగయ్య, ఉప్ప లయ్య, మహేష్, రవీందర్, నర్సింహులు, ఉప్పలయ్య, సురేష్ బాబు, సయీద్, వనం నర్సింహులు, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## అత్యవసర వైద్యం, అత్యంత కీలకం

### వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే వేడుకలు

### నెక్లెస్ రోడ్‌లో ఉత్సాహంగా మారథాన్

### ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో అత్యవసర వైద్యానికి కీలక స్థానం

### సెమి సేవల్ని ప్రశంసించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్ మే 27 (ప్రజామంటలు):** ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఎమర్జెన్సీ ట్రీట్మెంట్ చాలా ముఖ్యమైనదని, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన మెడికల్ హెల్ప్ చాలా ముఖ్యమైనదని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. వరల్ట్ ఎమర్జెన్సీ మెడిసన్ డే సందర్భంగా సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా (సెమీ) తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన మారథాన్ ను ఆయన ఎమ్మెల్సీ తక్కళ్ళపల్లి రవీందర్ రావు తో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రాధాన్యతపై అవగాహన పెంచడంలో ఈ సొసైటీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. అత్యవసర వైద్యం తమ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో కీలకమైన స్థానాన్ని కలిగి ఉందని, క్లిష్టమైన సమయాల్లో అత్యంత నైపుణ్యం, అంకితభావం కలిగిన అత్యవసర వైద్యులు చాలా అవసరం అన్నారు. సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా వైద్య సేవల్ని ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తుండడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ మారథాన్ 5కె, 10కె తో పాటు 10 కె సైకిలో థాన్ ను కూడా నిర్వహించించిది. సెమీ తెలంగాణ ప్రెసిడెంట్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.... ‘జీవితాన్ని కాపాడడంలో




ప్రతి సెకను ముఖ్యం’ అని, ఇది ఆసుపత్రుల్లో పనిచేసే వైద్య సిబ్బందికే కాకుండా సాధారణ పౌరులందరికీ వర్తిస్తుందని అన్నారు. ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స అందించడం, కార్డియాక్ అరెస్ట్‌లో ఉన్న వారికి సీపీఆర్ లాంటి ప్రాథమిక వైద్య సహాయాన్ని అందిం చడం వారిని సమీప ఆసుపత్రికి తరలించడంలో సహాయం చేయడం ప్రతి పౌరుడి విధిగా ఆయన పేర్కొన్నారు. సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా తమ 25వ వార్షికోత్సవాన్ని కూడా ఇదే రోజు జరపుకోవడం అనందంగా ఉందన్నారు. సెమీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరవణ కుమార్ మాట్లాడుతూ “ఎమ ర్జెన్సీ మెడిసిన్ సందేశాన్ని వ్యాప్తి చేయడానికి, ఈ మార థాన్‌లో 1000 మందికి పైగా పాలుపంచుకోవడం అభి నందనీయమన్నారు. సెమి ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్ వర్మ కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీని ఇన్ ఫ్రా యం.డి. శ్రీనివాస్, హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్, హైదరాబాద్ రన్స్ క్లబ్, ఇ.సి.ఐ. ఎ.ఎల్ రన్నర్స్ క్లబ్ తో పాటు సెమీ నేషనల్ గవర్నెన్స్ చైర పర్సన్ డాక్టర్ ఇమ్రాన్, కోశాధికారి సౌజన్య, సెమీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి, ఆర్గనైజింగ్ కో ఆర్టినేటర్ తరుణ్ పాల్గొన్నారు.

## నేడు హన్మకొండలో లయన్స్ నేత్రజ్యోతి కార్యక్రమం

**హన్మకొండ మే 27 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రాంతానికి చెందిన లయన్ నాయకులు డా. ఘట్ట మనేని బాబూరావు ఆశించిన సౌభ్రాతృత్వ సంకల్పానికి పూర్వ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ రుమాల్ల సునీల్



కుమార్ రూపకల్పన చేసిన స రి గ మ ప ద ని సంయుక్త సేవా కార్యక్రమాలు వరుసగా 320సి, 320బి, 320జి, 320ఏ, 320ఇ, 320డి జిల్లా గవర్నర్ ల నేతృత్వ సాకారంతో ఘనంగా నిర్వహించారు. ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మరొక కార్యక్రమంను – నేత్ర జ్యోతి కార్యక్రమం మే నెల 28 ఆదివారము రోజున ఉదయం హన్మకొండ లోని కెఎల్ఎన్ కన్వెన్షన్ లో 320ఎఫ్ జిల్లా ఆతిథ్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశు రాములు తెలిపారు. తెలంగాణా రాష్ట్ర పరిదిలో గల ఏడు లయన్స్ జిల్లాల నుండి ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మధ్య గల వసుదైక సౌభ్రాతృత్వ బంధుత్వం బంధాన్ని మరింత దృఢం కావడానికి ఈ కార్యక్రమం చక్కని వేదిక కాగలదని జిల్లా గవర్నర్ అన్నారు. అన్ని జిల్లాల గవర్నర్ల తో పాటు ఆయా జిల్లా ల పరిధిలో ఉన్న కంటి ఆసుపత్రులు, విజన్ సెంటర్ల ప్రతినిధులు పాల్గొంటారని, అంధత్వ నివారణా లక్ష్యాన్ని సాధించిన వారిని ప్రస్తుత లయనిస్టిక్ సంవత్సరంలో “నేత్రం ప్రదానం” (విజన్) విభాగంలో అత్యున్నత సేవలందించిన వారిలో ఉత్తములను గుర్తించి సన్మానం చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా తృతీయ త్రైమాసిక అవార్డులు ప్రదానం చేస్తారని కూడా జిల్లా గవర్నర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇసామి దేశాల కూటమి నాయకుడు ఆర్ సునీల్ కుమార్, ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎండార్సీ డా. జి. బాబూరావు మల్టిపుల్ ఛైర్మెన్ ఎం. విద్యాసాగర్ రెడ్డి, మాజీ చైర్మెన్ డా. జి. శ్రీనివాస రెడ్డి, ఛైర్మెన్ ఎలెక్ట్ తీగల మోహన్ రావు, తెలంగాణా జిల్లాల జిల్లా గవర్నర్ టీమ్ సభ్యులు, హోస్ట్ జిల్లా కు చెందిన జిల్లా గవర్నర్ ఎలెక్ట్ ఎన్. వెంకటేశ్వర రావు, తక్షిన పూర్వ జిల్లా గవర్నర్ ముచ్చ రాజిరెడ్డి, ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ ఎలెక్ట్ కుందూరు వెంకట్ రెడ్డి, సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ ఎలెక్ట్ డా. చంద్రశేఖర ఆర్యా, జిల్లా చీఫ్ అడ్వైజర్ డా. డి. లవకుమార్ రెడ్డి, జిల్లా క్యాబినేట్ కార్యదర్శి నాగబండి రవీందర్, కోశాధికారి అల్లాడి ప్రభాకర్ రావు, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ కురెంల యాదగిరి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్స్ వి.ప్రసాద రావు, సి. ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొంటున్నట్లు జిల్లా గవర్నర్ కన్న పరశురాములు తెలిపారు.



## లక్ష్య, ముస్కన్ పథకంలో మొదటి స్థానంలో నిలిచిన జనగామ

### జిల్లా కలెక్టర్ సిహెచ్. శివ లింగయ్య

**జనగామ మే 27 (ప్రజామంటలు):** సెంట్రల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మంత్రిత్వ శాఖ రాష్ట్రంలోని అన్ని ఏరియా,మాత శిశు సంరక్షణ కేంద్ర ఆసుపత్రులల్లో క్వాలిటీ లేబర్ రూమ్,ఆపరేషన్ థియేటర్స్ నిర్వహణ, వైద్య సేవల కోసం వచ్చే వారికి సంబంధించిన అత్యుత్తమ సేవలు అందించే సామర్థ్యం కలిగిన ఆస్పత్రుల్లో లక్ష్య, మూస్కన్, పథకాలలో తెలంగాణ రాష్ట్రంలో జనగామ జిల్లాను మొదటి స్థానంలో నిలిపినందుకు సంబంధిత వైద్య అధికారులను జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య శనివారం డాక్టర్ సుగుణాకర్ రాజు నూ, అభినందించారు. ప్రజలకు అత్యుత్తమ నాణ్యమైన వైద్య సేవలు మరింత అధికంగా అందించాలని ఆయన వైద్యాధికారులకు సూచించారు.

## పోచమ్మ గుడి నిర్మాణ పనులు ప్రారంభం

**చిల్పూర్ మే 27 (ప్రజామంటలు):** మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీ పోచమ్మ గుడి నిర్మాణ దాత స్థానిక ఎంపిటిసి చిల్పూర్ మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కంకటి రవీందర్ చేతుల మీదుగా గుడి నిర్మాణ పనులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది. ఈ



కార్యక్రమంలో ప్రజలు గ్రామ నాయకులు పాల్గొన్నారు. మోతే శ్రీనివాస్, మోతే దేవయ్య, నీరటి రాజు, కొలెపాక శివయ్య, బొట్టు యాదగిరి, భీమగోని పవన్, భీమగోని శ్రీనివాస్, యాదగిరి, భూక్య లాలు, తేజావత్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలు

### వాల్ పోస్టర్, క్యాలెండర్ల ఆవిష్కరణ

**జనగామ మే 27 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల వాల్ పోస్టర్, క్యాలెండర్ లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ, మిషన్ భగీరథ చైర్మన్ ఎర్రబెల్లి దయాకర్ రావు ఆవిష్కరణ. పాల్గొన్న ఎమ్మెల్యేలు




ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్య, జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య, డిసిపి సీతారాం, డిసిసిబి చైర్మన్ మారినేని రవీందర్రావు, మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి.

## చెంగిచెర్లలో ఉచిత వైద్య శిభిరం

### 151 మందికి పలు వైద్య పరీక్షలు

**సికింద్రాబాద్ మే 27 (ప్రజామంటలు):** చెంగిచెర్ల లోని భగత్ సింగ్ నగర్ కాలనీలో హిందుస్తాన్ స్కౌట్స్ ఆండ్ గైడ్స్, యశోదా గ్రూప్ ఆసుపత్రుల సహాకారంతో శనివారం శ్రీరామకృష్ణా వేణి సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఉదయం 9:00 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించిన మెడికల్ క్యాంపులో 151



మంది పేషంట్లకు యశోద ఆసుపత్రి వైద్యులు డెంటల్, కంటి, 2డీ, ఈసీజీ , గైనకాలజీ కి సంబందించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హిందుస్థాన్ స్కౌట్స్ ఆండ్ గైడ్స్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ కర్రు స్నేహిత్, యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ నంగునూరి శ్రీధర్, శ్రీరామ కృష్ణవేణి సేవా సొసైటీ నిర్వాహకులు సాయి, వాలంటీర్లు పాల్గొన్నారు.

## హార్ట్ ఫుల్ నేస్ వారి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో యోగ మహొత్సవం

### ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల రూరల్ మే 27 (ప్రజామంటలు):** ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం జగిత్యాల అధ్యక్షులు మంచాల కృష్ణ, రెడ్ క్రాస్ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, అసోసియేట్ డీన్ భారతి నారాయన్ బట్, అసిస్టెంట్ ప్రొఫెసర్



సంపత్, ట్రైనర్ సుధాకర్, మండల పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, మాజీ సర్పంచ్ నరేష్, రాయికల్ పాక్స్ ఛైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి, సురేష్, అనిల్, రామిడీ జగన్, చింతకింది రవి చంద్, రామ్ శంకర్, ఉప సర్పంచ్ మహేష్, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



### నీతి ఆయోగ్ సమావేశాలను

# బహిష్కరిస్తారా?

### రాష్ట్ర ప్రజలకు సమస్యలపై ఏం సమాధానమిస్తారు

### సిఎంల తీరుపై మండిపడ్డ బిజెపి నేత రవిశంకర్ ప్రసాద్

**న్యూఢిల్లీ,మే27(ప్రజా మంటలు):** నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించిన ముఖ్యమంత్రుల పై బీజేపీ విరుచుకుపడింది. సీఎంలు తీసుకున్న నిర్ణయం ప్రజావ్యతిరేకమని, బాధ్యతా రాహిత్యమని తెలిపింది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో... ఆరోగ్యం, స్కిల్ డవలప్‌మెంట్, మహిళా సాధికారత, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పలు కీలకాంశాలపై చర్చించేందుకు ప్రధానమంత్రి అధ్యక్షతన నీతి ఆయోగ్ సమావేశం శనివారంనాడిక్కడ జరిగింది. సమావేశానంతరం మీడియాతో కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, దేశ సంపూర్ణాభివృద్ధికి ఉద్దేశించిన రోడ్ మ్యాప్‌ను నిర్ణయించేందుకు ఉద్దేశించిన కీలకమైన సమావేశం నీతి ఆయోగ్ సమావేశమని, 8వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సుమారు 100కు పైగా అంశాలను చర్చించాలనే ప్రతిపాదన ఉందని, అయితే 8 రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశానికి హాజరుకాలేదని చెప్పారు. ఇంత పెద్ద సంఖ్యలో సీఎంలు హాజరుకాకుంటే, తమ రాష్ట్ర ప్రజల వాణిని వారు ఎలా వినిపించగలుగుతారని ప్రశ్నించారు. ఇది చాలా దురదృష్టకరమని, బాధ్యతారాహిత్యమైన, ప్రజావ్యతిరేక చర్య అని తప్పుపట్టారు. 'నరేంద్ర మోదీని ఎంతకాలం ఇలా వ్యతిరేకిస్తూ వస్తారు?' అని ఆయన నిలదీశారు. ప్రధాని మోదీతో విభేదించేందుకు మీకు మరిన్ని అవకాశాలు వస్తాయని, కానీ మీ రాష్ట్ర ప్రజలకు మీరు ఎందుకు హాని చేయాలనుకుంటున్నారని నీతి ఆయోగ్‌కు గైర్హాజరైన సీఎంలను ఉద్దేశించి ప్రశ్నించారు. నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించిన వారిలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తెలంగాణ సిఎం కెసిఆర్ తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీని గట్టెక్కించే యత్నంలో సజ్జన్నార్

### రకరకాల ప్రయత్నాల్లో ఎండి

**హైదరాబాద్,మే27(ప్రజా మంటలు):** నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించడం కోసం ఎండి సజ్జన్నార్ రకరకాల ప్రయత్నాలు మొదలు పెట్టారు. లాభాల పట్టించేందుకు తనముందున్న అనేక అవకాశాలు ఉపయోగించుకుంటున్నారు. ప్రయాణికులను ఆకట్టుకుని గమ్యానికి చేర్చేందుకు రకరకాల పథకాలను అమలు చేస్తున్నారు. అయితే కరిమింగిన వెలగపండులా ఆర్టీసీ రోజురోజుకూ కుదేలవుతోంది. ప్రస్తుత



నష్టాలను చార్జీల ద్వారా గట్టెక్కించడం అసాధ్యం. దీనికితోడు పెరుగుతున్న డీజిల్ ధరలు కూడా ఆర్టీసికి గుదిబండగా మారాయి. ఆర్టీసిని లాభాల్లోకి తీసుకుని రావడంతో పాటు, కార్మికులకు కాపాడుకునే బాధ్యత యాజమాన్యంపై ఉంది. ఆర్టీసీని రక్షించుకునే ప్రయత్నంలో కార్మికుల జీవితాలకు కూడా భరోసా కల్పించి ముందుకు సాగాల్సి ఉంది. ప్రజలకు ఉత్తమ, మెరుగైన రవాణా సౌకర్యాలు, బస్సుల్లో అధిక రద్దీని తగ్గించడం, అనుకూలమైన, అందుబాటు టికెట్ ధరలు, ఎక్కువ సంఖ్యలో బస్సులు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో సాగుతున్నది. సిఎం కెసిఆర్ ఆర్టీసీ రక్షణతో పాటు, కార్మికులు పక్షాన కూడా ఆలోచనతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసిని గట్టెక్కించాల్సి ఉంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆధీనంలోని వివిధ రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహి స్తున్నాయి. వాటిని పాక్షికంగా లేదా పూర్తిగా ప్రైవేటీకరించే దిశగా ప్రయత్నిస్తున్నాయి. ఇంతకాలం తెలంగాణను ధనిక రాష్ట్రంగా చెప్పుకోవటానికి ఇష్టపడిన కేసీఆర్ కూడా, అనేక సంక్షేమ పథకాల అమలు వల్ల ఎప్పటికప్పుడు నిండుకుంటున్న ఖజానాతోపాటు, ఆర్థిక మాంద్యం దెబ్బతో బడ్జెట్ లెక్కలను నేల మీదకు దించక తప్పలేదు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయటం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే పనికాదనేది ఆర్థిక రంగ నిపుణుల అభిప్రాయం. మారిన పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టుకు పూర్తిగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతున్న వారు మినహా మిగిలిన జనం పెద్దగా ఇబ్బంది పడటంలేదు. రాష్ట్రం వచ్చాక అడిగిన వారికి, అడగని వారికీ ఉదారంగా వరాలు ఇచ్చిన సీఎం కేసీఆర్, ఆర్టీసిని కూడా ఏదో రకంగా గట్టెక్కించి లాభాల్లోకిరాకున్నానష్టాలు రాకుండా చూడగలగాలి. ఇది ఏ ఒక్కరిద్దరి సమస్యనో కాదు. 50వేల మంది కార్మికులు, వారి కుటుంబాలతో ముడిపడి ఉన్న అంశం.

# లిక్కర్ స్కామ్‌పై చర్చించేందుకే!

### కెసిఆర్, కేజ్రీవాల్ భేటీపై పొన్నాల ఫైర్

**హైదరాబాద్,మే27(ప్రజా మంటలు):** లిక్కర్ స్కాం కేసు గురించి చర్చించడానికే సీఎం కేసీఆర్‌తో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ భేటీ అయ్యారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఈ కేసులో ఇద్దరూ తోడుదొంగలేనని అన్నారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ కేజ్రీవాల్ పక్కనే ఉండే అన్నా హాజరే ఎటు పోయారని ప్రశ్నించారు. 69 ఏళ్ళలో రూ. 71 వేల అప్పు చేస్తే... కేవలం 9 ఏళ్ళలో కేసీఆర్ రూ. 5 లక్షలు అప్పు చేశారని విమర్శించారు. ప్రజల దృష్టిని మరలించడానికి ఇక్కడ కేసీఆర్, అక్కడ మోదీ జిమ్మిక్కులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై మోదీకి విశ్వాసం ఉందా? అని పొన్నాల లక్ష్మయ్య ప్రశ్నించారు. బీజేపీ పాలన తమకొద్దంటూ జనం చేతులు ఎత్తి దండం పెడుతున్నారన్నారు. దేశంలో ఆర్డినెన్స్‌ల ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. పార్లమెంట్ భవనం ఏదైనా బీజేపీ అప్రజాస్వామికపాలనలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. అధికారంలోకి రాగానే నల్లధనం తెస్తామని నరేంద్రమోదీ



అన్నారని, అది ఏమైందని పొన్నాల లక్ష్మయ్య ప్రశ్నించారు. పార్లమెంట్‌లో నల్లధనం గురించి చర్చించే దమ్ము బీజేపీకి ఉందా? అని నిలదీశారు. ఉద్యోగాల గురించి డిబేట్ చేసే ధైర్యం ప్రధాని మోదీకి ఉందా?..అదాని కంపెనీలలో పెట్టుబడుల గురించి మాట్లాడమంటే మోదీ ఎందుకు భయపడుతున్నారన్నారు. పార్లమెంట్‌పై నమ్మకం లేని ప్రధాని లాంటి వ్యక్తికి పార్లమెంట్ కొత్త భవనం అయితే ఏంటి, పాత భవనం అయితే ఏంటి? అంటూ పొన్నాల లక్ష్మయ్య వ్యాఖ్యానించారు.

## ఎమర్జెన్సీ సేవల రంగంలో కృషి అభినందనీయం

### మారథాన్ ప్రారంభించిన మంత్రి తలసాని

**హైదరాబాద్,మే27(ప్రజా మంటలు):** రాష్ట్రంలో ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రాధాన్యతపై అవగాహన పెంచడంలో సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా (అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర పశుసంవర్థక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా శనివారం నెక్లెస్ రోడ్‌లో మారథాన్ నిర్వహించారు. సంజీవయ్య పార్కు సమీపంలో థ్రిల్ సిటీ వద్ద మారథాన్ 5కె, 10కె తో పాటు 10 కె సైకిలో థాన్ ను ఎమ్మెల్సీ





తక్కళ్లపల్లి రవీందర్‌రావు కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి అత్యవసర వైద్యం, ఆరోగ్య సంరక్షణ కీలకమైన స్థానాన్ని కలిగి ఉందని అన్నారు. అత్యవసర సమయాల్లో అత్యంత నైపుణ్యం, అంకితభావం, నిపుణులైన వైద్యులు అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సెమి వైద్య సేవల్ని ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తుండడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సెమి తెలంగాణ ప్రెసిడెంట్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 'జీవితాన్ని కాపాడడంలో ప్రతి సెకను ముఖ్యం' అని, ఇది ఆసుపత్రుల్లో పనిచేసే వైద్య సిబ్బందికే కాకుండా సాధారణ పౌరులందరికీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స అందించడం, కార్డియాక్ అరెస్ట్‌లో ఉన్న వారికి ప్రాథమిక వైద్య సహాయాన్ని అందించడం వారిని సమీప ఆసుపత్రికి తరలించడంలో సహాయం చేయడం ప్రతి పౌరుడు విధిగా భావించాలని కోరారు. సెమి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరవణ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్ వర్మ, శ్రీని ఇన్ ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్, హైదరాబాద్ రన్స్ క్లబ్, ఈసీఐఎల్ రన్నర్స్ క్లబ్ తో పాటు సెమి నేషనల్ గవర్నెన్స్ చైర్ పర్సన్ డాక్టర్ ఇమ్రాన్, కోశాధికారి సౌజన్య, సెమి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి, ఆర్గనైజింగ్ కో ఆర్డినేటర్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల కాలాన్ని ముందుకు జరపాలి

### ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే ప్లాన్ చేయాలి

### రైతు అవగాహన సదస్సులో స్పీకర్ పోచారం సూచన

**కామారెడ్డి,మే27(ప్రజా మంటలు):** పంటల విధానంలో మార్పు రావాలని, ప్రకృతి వైరీత్యాలనుంచి కాపాడుకునేలా ప్రణాళిక చేసుకోవాలని స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి రైతులకు సూచించారు. ఇంకా కొంతమంది రైతులు ఆలస్యంగా నార్లు పోసి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారని చెప్పారు. వారందరూ ఇకనైనా మారాలని సూచించారు. ఆలోచన చేసి పంట కాలాన్ని ముందుకు జరుపుకోవాలన్నారు. కామారెడ్డి జిల్లాలోని నస్రుల్లాబాద్ మండలం నెమ్లి సాయిబాబా గుడి ఫంక్షన్ హాల్‌లో బాన్సువాడ నియోజకవర్గ స్థాయి రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో జరుగుతున్న మొదటి 'రైతు అవగాహన సదస్సు' అని పేర్కొన్నారు. యాసంగి కోసం నవంబర్ రెండో వారంలో నార్లు పోసుకోవడం ద్వారా ఏప్రిల్ నెలలో సంభవించే అకాల వర్షాలు, వడగండ్ల నుండి తప్పించుకోవచ్చని సూచించారు. రైతులు కోరితే నార్లు పోసుకోవడానికి నిజాంసాగర్ కాలువల క్రింద నీళ్ళు అందిస్తామన్నారు. విత్తనాలు, ఎరువులకు కొరత లేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో పంటల ఉత్పత్తులను కొనే దిక్కు లేదన్నారు.

తెలంగాణ రాష్ట్రం మాత్రమే మద్దతు ధరతో వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. నష్టమైనా ప్రభుత్వం మొక్కజొన్న, జొన్నలను



కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో 2014లో 1.08 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంటే నేడు 2.18 కోట్ల ఎకరాలకు పెరిగిందన్నారు. రైతు వేదికలను ఉపయోగించుకుని రైతులకు సేవలను అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, రైతులను కలిసి నివేదికలు రూపొందించాలని, గాలి లెక్కలు రాయవద్దని సూచించారు.



## మీడియాపై ఆంక్షలు ఎత్తేయాలి

### లోక్‌సభ స్పీకర్‌కు పిసిఐ లేఖ

**న్యూఢిల్లీ,మే27(ప్రజా మంటలు):** ఈ నెల 28న జరిగే నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి ఎలాంటి ఆంక్షలు లేకుండా మీడియాను అనుమతించాలని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా పిసిఐ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు పిసిఐ లేఖ రాసింది. ఎలాంటి షరతులు లేకుండా లోక్‌సభ ప్రెస్ గ్యాలరీలోకి మీడియా ప్రవేశాన్ని అనుమతించాలని కోరింది. శాశ్వత ప్రెస్ గ్యాలరీ పాస్‌లు ఉన్నప్పటికీ పెద్ద సంఖ్యలో జర్నలిస్టులను గ్యాలరీలోకి అనుమతించని విషయాన్ని లేఖలో పిసిఐ గుర్తు చేసింది. కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో 2020 బడ్జెట్ సెషన్‌లో మీడియా ప్రతినిధులపై ఆంక్షలు అమలు చేశారని, తరువాత కాలంలో కోవిడ్ ఆంక్షలను ఎత్తివేసినా.. జర్నలిస్టుల ప్రవేశంపై ఆంక్షలను సడలించలేదని లేఖలో పిసిఐ తెలిపింది. జర్నలిస్టులపై ఆంక్షలకు ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన కారణాలు చెప్పడం లేదని, కాబట్టి ఇలాంటి ఆంక్షలు మీడియాను నియంత్రించడానికి, స్వతంత్ర వార్తా కథనాల స్వేచ్ఛా ప్రవాహానికి ఆటంకం కలిగించడానికి, పత్రికా స్వేచ్ఛను పరిమితం చేయడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న ఎజెండాలో భాగంగా విశ్వసించాల్సి వస్తోందని పిసిఐ లేఖలో విమర్శించింది. అలాగే రద్దు చేసిన లోక్‌సభ ప్రెస్ అడ్వైజరీ కమిటీని తక్షణమే పునరుద్ధరించాలని పిసిఐ డిమాండ్ చేసింది.

## ఢిల్లీని చల్లబర్చిన వరుణుడు

### ఉరుములు మెరుపులతో భారీ వర్షం

### పలు విమాన సర్వీసులు రద్దు

**న్యూఢిల్లీ,మే27(ప్రజా మంటలు):** దేశరాజధాని ఢిల్లీలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నిన్నటివరకు భానుడి భగభగలతో అల్లాడిపోయిన ఢిల్లీ కాస్త చల్లబడింది. శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని పలు ప్రాంతాలతో పాటు హరియాణాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. గంటకు 40 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. భారీ వర్షం కారణంగా ఢిల్లీ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పలు విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. మే 30వ తేదీ వరకు ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. పలు ప్రాంతాలతో పాటు హరియాణాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. భారీ వర్షం కారణంగా ఢిల్లీ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పలు విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. మే 30వ తేదీ వరకు ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

## అభివృద్ధిలో తెలంగాణ దూకుడు

### దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలు

### ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి ఎర్రబెల్లి

**జనగామ,మే27(ప్రజా మంటలు):** దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీఆర్ఎస్ శ్రేణులపై ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. దీంతో పాటు ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కూడా తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల మండలం కొడకండ్ల, ఏడునూతుల గ్రామంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో



అమరుల ఆశయాలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతున్నదని వెల్లడించారు. రైతులకు ఇస్తున్న ఉచిత 24 గంటల విద్యుత్ వల్ల ప్రతి ఏటా రైతుల తరపున రూ. 10,500 కోట్లను విద్యుత్ సంస్థకు చెల్లిస్తున్నారని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి అడుగడుగునా అడ్డు పడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విధానాలను తిప్పికొట్టాలని సూచించారు. మహిళా సాధికారత దిశగా ఉచిత కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీ అందజేస్తూ ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువకుల కోసం కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు. నియోజకవర్గంలోని ఒక్కో మండలాన్ని రూ. 100 కోట్లతో అభివృద్ధి చేశానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్న సమయంలో అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ప్రజలు కూడా ఆయా పనులను విశ్లేషించుకుని, సీఎం కేసీఆర్ అండగా నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు.

## ఎన్నికల ముందు స్కీమ్‌లు..తరవాత స్కామ్‌లు

### కెసిఆర్ సర్కార్ తీరుపై మండిపడ్డ అర్వింద్

**నిజామాబాద్,మే27(ప్రజా మంటలు):** ఎన్నికలప్పుడే గొర్రెలు, బర్రెల స్కీమ్ లంటూ కెసిఆర్ మాయ చేస్తున్నాడని, ప్రజలు మరోసారి మోస పోవద్దని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తి చేశారు.



ఓట్లు దండుకోవడానికి ఎన్నికల ముందు స్కీములు తీసుకొచ్చి సీఎం కేసీఆర్ మోసం చేస్తాడని బీజేపీ నేత ఆరోపించారు. అమరవీరుల త్యాగాల పునాదులపై తెలంగాణ నిర్మించుకుంటే కేసీఆర్ ఫ్యామిలీ బంగారు తెలంగాణ అంటూ తన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా మార్చుకుందని విమర్శించారు. ఉమ్మడి ఏపీలో జరిగిన అభివృద్ధి తప్ప, తెలంగాణ వచ్చాక ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. 9 ఏళ్ల పాలనలో ఎన్ని డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టారో లెక్కలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. స్థలం సేకరించకుండా, ఉన్న జాగలను గుంజుకున్న దద్దమ్మలకు ఓటు అడిగి నైతిక హక్కు లేదన్నారు ప్రస్తుతం గ్రామాల్లో అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతుందని చెప్పారు.

# మన చారిత్రక వారసత్వం సెంగోల్

### రాజదండం మన పూర్వ వైభవానికి ప్రతీక

### పార్లమెంట్ ప్రారంభోత్సవ వేళ మళ్లీ మహర్దశ

**న్యూఢిల్లీ,మే27(ప్రజా మంటలు):** ప్రపంచవ్యాప్తంగా నాటి నుంచి నేటివరకు నిరంతరాయంగా కొనసాగుతున్న అత్యంత ప్రాచీ నాగరికత ఉన్న దేశం భారతదేశం మాత్రమే. మన నాగరికత అత్యంత పురాతనమైనదే గాకుండా కాలానికి నిలబడి ఎన్నో పరీక్షలను ఎదుర్కొని చెక్కుచెదరకుండా కొనసాగుతూ వస్తోంది. అలాంటి భవ్యమైన, దివ్యమైన నాగకరికతకు తోడు మన చరిత్రను, నాగరిక విలువలను, మన కళలు, సంస్కృతిని, వారసత్వాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. మన పండగలు, ఆహారపు అలవాట్లు, నృత్యాలు, సంగీతం, సాహిత్యం... ఇవన్నీ మన నాగరికతా విలువలను ప్రతిబింబిస్తాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పవిత్రమైన చిహ్నాలు, పురాతన వస్తువులు, కళాఖండాలను పరిరక్షించుకోవడం వాటిని తగు రీతిలో గౌరవించుకోవడం అవసరం. దేశం గర్వించదగిన చారిత్రక ఘట్టానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన 'సెంగోల్'ను నూతన పార్లమెంటు భవనంలో ప్రతిష్ఠించబోతుండటం.. ఓ రకంగా మన వారసత్వాన్ని గుర్తించడమే అవుతుంది. మననాగరికతను గౌరవించుకోవడమే అవుతుంది. దీనిని విమర్శించుకోవడానికి ఇది సందర్భం ఎంతమాత్రం కాదు. మన ప్రజాస్వామ్యంలో ఇలాంటి చిహ్నాలు, వాటికి సంబంధించిన స్ఫూర్తి వాక్యాలెన్నో ఉన్నాయి. ఇవన్నీ రాజదండం వంటివే. ప్రతి చిహ్నానికీ దానికంటూ ఓ ప్రత్యేకత, ఓ నినాదం ఉంటాయి. ఆ నినాదాలే స్ఫూర్తిని రగిలిస్తాయి, మార్గదర్శనం చేస్తాయి. సారనాథ్‌లోని అశోక స్తంభంపై భాగంలో అలంకరించబడిన నాలుగు సింహాల గుర్తు మన జాతీయ చిహ్నం. దాని కింద రాయబడిన 'సత్యమేవ జయతే' మన జాతీయ నినాదం. ఈ జాతీయ చిహ్నం ప్రభుత్వ రోజువారీ పనితీరులో.. ప్రతిబించబించాలని ఆనాటి మన రాజ్యాంగ నిర్ణేతలు మనలను ముందుకు నడిపారు. నిరంతరం 'సత్యమేవ జయతే స్ఫూర్తి'ని ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజల కోసం నీతి, నిజాయితీ, నిర్భీతిగా నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన ప్రేరణను కలగజేస్తుంది. భారత సుప్రీంకోర్టు



చిహ్నంలోనూ నాలుగు సింహాల గుర్తు కింద 'యతో ధర్మ స్తతో జయః' అని రాసి ఉంటుంది. ధర్మం ఉన్న వైపే విజయం ఉంటుందని దానర్థం. న్యాయవ్యవస్థకు ఇదే స్ఫూర్తి. భారతదేశ ఆర్మీ లోగో కింద 'సేవా పరమోధర్మ' అని రాసి ఉంటుంది.

దేశ సేవ ఉత్తమమైన ధర్మం, తర్వాతే ఏదైనా అని దానర్థం.. ఇది నిరంతరం సైనికులకు స్ఫూర్తిని అందిస్తుంది. ఎయిర్‌ఫోర్స్‌కు 'నభ స్పృశం దీప్తం' అనే నినాదం ఉంది. భగవద్గీత నుంచి తీసుకున్న ఈ నినాదం అర్థం.. ఆకాశాన్నంటేలా విజయం సాధించాలని అర్థం. అలాగే నౌకాదళం లోగో 'శంనో వరుణం' అని రాసి ఉంటుంది. విద్యాసంస్థలు, యూనివర్సిటీలు, వైద్య సంస్థలు ఇలా ప్రతి సంస్థకు వారి దైనందిన కార్యక్రమాల్లో స్ఫూర్తి కలిగించేందుకు చిహ్నాలు, నినాదాలు ఉంటాయి. ఇదే భారతీయ సంస్కృతి. ఇలాంటి స్ఫూర్తే కొత్త పార్లమెంటు ద్వారా పార్లమెంటు సభ్యులకు కలగాలని, అనునిత్యం సత్యం, న్యాయం, ధర్మాలను గుర్తుచేయాలనేదే ప్రధానమంత్రి ఆలోచన. అందుకే పార్లమెంటు భవనంపై నాలుగు గర్జిస్తున్న సింహాలతోపాటు 'సెంగోల్' చిహ్నాన్ని పార్లమెంటులో ప్రతిష్ఠించనున్నారు. ఆధునిక కాలంలో.. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటుకు ఉన్న ప్రాధాన్యత, గౌరవం దృష్ట్యా ఈ సెంగోల్ చిహ్నాన్ని లోక్‌సభ స్పీకర్ చాంబర్‌లో ఏర్పాటుచేసేందుకు మోదీ సంకల్పించారు. ఈ పవిత్ర చిహ్నాన్ని ఏర్పాటుచేసేందుకు ఇంతకుమించిన సమున్నత స్థానం మరొకటి ఉండదని నా అభిప్రాయం. పార్లమెంటు నూతన భవన శంకుస్థాపన సమయంలో సత్యం, న్యాయం, ధర్మమార్గంలో వీటిని చేరుకు నేందుకు సెంగోల్ స్ఫూర్తిని పొందడం.. భారతదేశపు దక్షిణ, ఉత్తర ప్రాంతాల మధ్య సాంస్కృతిక, వారసత్వ సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా చేపడుతున్న కార్యక్రమాలకు ఈ సెంగోల్ స్ఫూర్తిగా నిలుస్తుంది. తొలి స్వాతంత్య వేడుకల సందర్భంగా అధికార మార్పిడి కోసం ఉపయోగించిన రాజదండం అలహాబాద్ మ్యూజియంలో ఉన్నట్లు గుర్తించేందుకు నాలుగు నెలలు పట్టిందని, తమిళనాడుకు చెందిన నగల వర్తకులు ఉమ్మిడి సుధాకర్, ఆయన కుమారుడు ఉమ్మిడి బాలాజీ తెలిపారు. తమ సంస్థ 75 యేళ్ల క్రితం తయారు చేసిన ఆ రాజదండం కొత్త పార్లమెంట్ భవనంలో చోటుచేసుకోనుండటం తమ సంస్థకే కాక తమిళులరందరికీ గర్వకారణమని చెప్పారు. తిరువాడుదురై ఆధీనం సూచనల ప్రకారమే తమ సంస్థ ఆ రాజదండాన్ని తయారు చేసిందన్నారు. అప్పట్లో దాని విలువ రూ.15 వేలని తెలిపారు.



## మహా సంపర్క్ అభియాన్‌ను విజయవంతం చేయండి

**బుగ్గారం మే 27 (ప్రజామంటలు):** బిజెపి ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి బుగ్గారం మండల అద్యక్షులు మెడవేని శ్రీధర్ పిలుపునిచ్చారు. శనివారం బుగ్గారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి బిజెపి కార్యవర్గ సమావేశానికి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ ప్రతిష్టాత్మకంగా మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త ఇంటింటి ప్రచారం చేపట్టి ప్రజలందరూ భారీగా తరలివచ్చేలా కృషి చేయాలని శ్రీధర్ కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన స్వచ్ఛ భారత్ రాష్ట్ర కన్వీనర్ మంచే రాజేష్ మాట్లాడుతూ.... మండలంలోని ఐకేపీ కేంద్రాలలో ఉన్న వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందపల్లి శ్రీనివాస్, దనందుల లచ్చయ్య, వడుకాపురం సత్యనారాయణ, చిపిరిశెట్టి మధుకర్, అమర్ సింగ్, బందారు సత్తయ్య, పిట్టల వెంకటేష్, సతీష్, తిరుపతి తదితరులు ఉన్నారు.

## ఫిషరీస్ ఫెడరేషన్ ఛైర్మన్‌తో ముదిరాజ్ నేతల భేటి

**సికింద్రాబాద్, మే 27 (ప్రజామంటలు):** ఇటీవల నూతనంగా నియమితులైన రాష్ట్ర మత్స్య సహకార, సమాఖ్య సంస్థ ఛైర్మన్ పిట్టల రవీందర్ తో శనివారం రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు భేటి అయ్యారు. ఈ సందర్భంగా శాలువాతో ఆయన్ని ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో అనేక కార్యక్రమాల్లో ముందుండి అందరిని నడిపించిన



పిట్టల రవీందర్ కాస్తా ఆలస్యమైనప్పటికీ సముచిత స్థానం కల్పించినందుకు ముదిరాజ్ నేతలు సీఎం కేసీఆర్, మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ ముదిరాజ్, ఆలిండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సురేశ్, ముదిరాజ్ ఎస్. నాగయ్య ముదిరాజ్ లు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటి సమావేశం

**ధర్మపురి మే 27 (ప్రజామంటలు):** ధర్మపురి చైర్మన్ అయ్యోరి రాజేష్ కుమార్ అధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశములో 2023 మార్చి మరియు ఏప్రిల్ మాసములు ఆదాయ వ్యయాలు మరియు తదితర అంశములపై చర్చించారు. సమావేశములో పురపాలక సంఘ చైర్ పర్సన్ సంగి



సత్తమ్మ, జైన ఫ్యాక్స్ చైర్మన్ శ్రీ సౌల్ల నరేష్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ అక్కేనపెల్లి సునీల్ కుమార్, పాలకవర్గ సభ్యులు వీరవేని రాజ మల్లయ్య, గైని మల్లేశం, మైనేని వెంకటి, మామిడి శ్రీనివాస్, చక్రాల శ్రీనివాస్, జంగా శ్రీనివాసు, గాజుల సత్తయ్య, ర్యాగల నారయణ, మహమ్మద్ ఇక్రం బొల్లం హరి ప్రసాద్ మరియు జిల్లా మార్కెటింగ్ అధికారి డి. ప్రకాష్, మార్కెట్ కార్యదర్శి యం. భూమన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన దీక్ష

**జనగామ మే 27 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిడి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జనగామ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆరుట్ల దశమంత రెడ్డి , కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మొన్న రాష్ట్రంలో కురిసిన వడగండ్ల వర్షానికి నష్టపోయిన రైతులకు ఎకరానికి 10వేల చొప్పున ఇస్తామని ప్రకటించిన నేటి వరకు రైతులకు ఒక్క రూపాయి కూడా అందలేదని, నష్టపోయిన రైతులకు యుద్ధ ప్రాతిపదికన నష్టపరిహారం అందించాలని, లక్ష రూపాయల రుణమాఫీని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణ రైతులకు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎద్దేడిచిన ఎవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డట్టు చరిత్రలో లేదని రైతులను నిర్లక్ష్యం చేస్తే రైతులు



సరైన సమయంలో తగిన బుద్ధి చెప్తారని, రైతు సమస్యలపై రైతులకు న్యాయం జరిగేంతవరకు భాజపా వారికి అండగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే వి ఎల్ ఎన్ రెడ్డి, ఉడుగుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సౌద రమేష్, శివరాజ్ యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సరికొండ భాస్కర్ రెడ్డి, వేణు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బెజాడ బీరప్ప, రాష్ట్ర నాయకులు లేగ రామ్మోహన్ రెడ్డి, దుబ్బ రాజశేఖర్, ఓబీ సి మోర్చా జిల్లా అధ్యక్షులు గుజ్జుల నారాయణ, అసెంబ్లీ కన్వీనర్లు బల్ల శ్రీనివాస్, కర్ర శ్రీనివాస్ రెడ్డి, యువ మోర్చా అధ్యక్షులు మహిపాల్, బొజ్జపల్లి సుభాష్, పెద్దోజు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో హనుమంతుడి గుడి లేని ఊరు ఉండదు

### కేసిఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ఇల్లు ఉండదు

### మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి




**కామారెడ్డి మే 27 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రం సాధించిన అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత గత తొమ్మిది సంవత్సరాలుగా సాధించిన ప్రగతిని పల్లె పల్లెన ప్రజలకు వివరిస్తూ ఘనంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాలలో నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని, అందరూ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రభుత్వం సూచించిన క్యాలెండర్ ప్రకారం పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. జూన్ 2న పథకావిష్కరణ, దశాబ్ది ఉత్సవ సందేశంతో ఉత్సవాలు ప్రారంభమై జూన్ 22 అమరవీరుల సంస్మరణ సభ, అమరవీరుల స్తూపం అవిష్కరణతో ముగిస్తున్నట్లు తెలిపారు. 20 రోజుల పాటు ఊరూరా పండుగ వాతావరణంలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని, తెలంగాణ ప్రగతిని ప్రతి ఒక్కరికి తెలిసేలా వెలుగెత్తి చాటాలన్నారు. రాష్ట్రం రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని మరొక్కసారి గుర్తు చేస్తూ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రైతు వేదికల వద్ద ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రైతులతో కలిసి భోజనం చేయాలని అన్నారు. రాష్ట్రం ఏర్పాటు లాగే కామారెడ్డి జిల్లా ఏర్పాటు అనేది ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని, అదే విధంగా నూతన మండలాలు, నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుతో ప్రజలకు పాలన మరింత దగ్గరైందని అన్నారు. కొత్త జిల్లాగా ఏర్పాటు అయిన కామారెడ్డి జిల్లా కేంద్రంలో సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా కోసం జరుగుతున్న కృషిని, మన ఊరు- మన బడి కింద పాఠశాలల్లో వచ్చిన మార్పును నాడు-నేడు ఫోటోలతో ప్రదర్శించాలని పేర్కొన్నారు. కామారెడ్డికి మెడికల్ కాలేజ్, బాన్సువాడలో నర్సింగ్ కళాశాల, వివిధ చోట్ల వచ్చిన ప్రభుత్వ డిగ్రీ, ఇతర కళాశాలలు, గురుకుల, సంక్షేమ ఇతర పాఠశాలల వివరాలు తెలియజేయాలన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతితో జాతీయ స్థాయి అవార్డులు సాధించి తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా సాగునీటి చెరువుల పునరుద్ధరణ, గ్రామాల్లో చెక్ డ్యాములు, ఊట చెరువుల నిర్మాణం తో భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. రాష్ట్రం వస్తే చీకటి అవుతుందని చెప్పిన చోట నేడు విద్యుత్తు వెలుగులు చిమ్ముతూ 9 ఏళ్లలో సాధించిన ప్రగతిని గర్వాంగా చాటుకుంటు ప్రజలతో మమేకం అవుతూ ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని, ఒక్కో గ్రామానికి అందుతున్న రైతు బంధు, రైతు భీమా, వివిధ రకాల పెన్షన్లు, షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి, చెరువుల్లో వదిలిన చేప పిల్లలు, గొర్రెల పంపిణీ అన్ని రకాల వివరాలతో గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కింద మంజూరైన పనుల వివరాలతో పాటు అన్ని రకాల అభివృద్ధి నిధుల వివరాలు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఆధునికతతో ఉపాధి కోల్పోయిన కుల వృత్తుల వారికి అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించి ఒక లక్ష రూపాయలు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు నిర్ణయించారని తెలియజేశారు. ఈ మేరకు పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేసి దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అందజేయాలని సూచించారు. 4,480 మంది రైతులకు 12,969 ఎకరాలు పోడు పట్టాలు గిరిజనులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత గల వారికి ఇంటి స్థలాల పట్టాలు అందజేయాలని తెలిపారు. జూన్ 19న జరిగే తెలంగాణ హరితోత్సవం కార్యక్రమంలో గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని చెప్పారు. మంత్రికి చప్పట్లతో అభినందనలు తెలిపిన ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు రాష్ట్రంలో చిరస్థాయిగా నిలిచిపోయే కట్టడాల్లో భాగస్వామ్యం అయిన జిల్లా ఇంఛార్జి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి గారికి శుభాకాంక్షలు అని ఎమ్మెల్యే జజాల సురేందర్ తెలిపారు. రాష్ట్ర రాజధానిలో నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం,రాష్ట్ర సచివాలయం,అమరవీరుల స్మారక చిహ్నం,పోలీస్ కమాండ్ కంట్రోల్ లాంటి తెలంగాణ ఖ్యాతిని చాటే నిర్మాణాల్లో ఉద్యమకారుడైన ప్రశాంత్ రెడ్డి గారు భాగస్వామ్యం కావడం తమకు ఎంతో గర్వ కారణమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్,ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంతు షిండే,జిల్లా ప్రజాప్రతినిధులు,జిల్లా కలెక్టర్,అధికారులు తదితరులు మంత్రికి చప్పట్లతో అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పి చైర్ పర్సన్ శోభ, ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు సురేందర్, హనుమంత్ షిండే, మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే , డిఎఫ్ఓ నిఖిత, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# వల్మిడి డిస్కవరీ

### చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి

**జనగామ మే 27 (ప్రజామంటలు):** జనగామ జిల్లా పాలకుర్తి వల్మిడికి విదేశి వాణిజ్య సంబంధాలున్నట్లు డిస్కవర్ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి క్షేత్రస్థాయి పరిశోధన ద్వారా తెలియజేశారు. శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం లోని వాల్మీకి గ్రామంలో ఉన్న రాముని గుట్ట , మునుల గుట్ట, పెద్దమ్మ బండ కేంద్రంగా మూడు వేల ఏళ్ల కిందటి సుసంపన్నమైన బృహద్ శిలాయుగం మరియు శాతవాహనుల కాలం నాటి సంస్కృతి విలసిల్లిందని చెప్పడానికి అనేక ఆధారాలను గుర్తించారు.

రామాలయం ఉన్న గుట్ట నుండి మంచుప్పుల వెళ్లే దారికి రెండు వైపుల గుట్టల దిగువన విశాలమైన "పాటి మీద" (దుబ్బ) అని పిలిచే ప్రాంతం ఉంది. రాముని గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతున్న క్రమంలో ఎత్తైన రోడ్డు మార్గం వేయడానికి రెండు వైపుల కందకాలు తీశారు. ఈ కందకాలలో మరియు రోడ్ కి రెండు వైపుల ఉన్న సాగు భూముల్లోనూ అనేక మృణ్మయపాత్రలు(మట్టి పాత్రలు) ఉపరితలంలో కనిపిస్తున్నాయి. శాతవాహనులు తెలంగాణతో పాటు దక్షిణ భారత దేశంలో విశాల సామ్రాజ్యాన్ని స్థాపించారు. క్రీ పూ ఒకటి మరియు రెండు శతాబ్దాల నాటికే రోమన్ లతో వర్తక వాణిజ్య సంబంధాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. జనగామ జిల్ల లోని అనేక గ్రామాల్లో శాతవాహనుల కాలం నాటి ఇటుకలు లభించాయి. వల్మిడి పాటి మీద కూడా పెద్ద పెద్ద ఇటుకలతో పాటు గృహ అవసరాల కోసం , అలంకారం కోసం ఉపయోగించే రౌలెటెడ్ వేర్ అని పిలుచుకునే రోమన్ పాత్రలు, పిల్లల కోసం ఆడుకునే చేతిలో ఇమిడే చిన్న చిన్న మట్టి కుండలు , ఎరుపు, ముదురు ఎరుపు, నలుపు,బూడిద రంగుల్లో అనేక డిజైన్లు ఉన్న మట్టి పాత్రలు, ధాన్యం నిలువ కోసం ఉపయోగించే గాబులు, పసి పిల్లలకు పాలు తాగించే రంధ్రం ఉన్న మట్టి పాత్రలు , నాణ్యత లోపించిన మట్టి పూసలు, చేత్తో చేసి కాల్చిన ఎద్దు బొమ్మలు, ఒక ఫీట్ కంటె పొడవైన నాలుగు కాళ్ళ రాతి పీటలు, రాతి గొడ్డళ్లు, ఇతర రాతి పనిముట్లు , పెద్ద పెద్ద ఇటుకలు, గుండ్రని రాతి మరియు మట్టి బిళ్ళలు అనేక సంఖ్యలో లభిస్తున్నాయి.

ఒక లైమ్ స్టోన్ (సున్నపు రాయి) ముక్క లభించడం విశేషం. గుట్టకు వెళ్లే తోవలో ఎడమ వైపు రోడ్డు నుండి ఎర్ర చెరువు మత్తడి వాగు, తునికాకు బండ వరకు చిట్టెపురాళ్లు, ఇనుప ముక్కలతో నేల ఉపరితలం కప్పి ఉంది. ఇనుప రాతి నుండి ఇనుమును సంగ్రహించి, ఇనుము లేదా ఉక్కు ముద్దలు చేయడానికి కమ్మరి కొలుములు ఉన్నట్లు ఇక్కడ ఎక్కువగా కనిపిస్తున్న ఇటుకల ద్వారా తెలుస్తున్నది. పెద్ద ఎత్తున తయారు చేసిన ఇనుము మరియు ఉక్కు ముద్దలు ఎగుమతి చేసే వారనీ తెలుస్తున్నది. పాటి మీద లభిస్తున్న పెబ్బల్ రకపు రాళ్లతో పాటు,



స్థానిక బీరప్ప గుడిలో లింగాలుగా పూజించ బడుతున్నవన్ని వాగులు,నదీ ప్రవాహాల నుండి తెచ్చుకున్నవే. చదవడం, రాయడం తెలియని చరిత్ర పూర్వ యుగము నుండే వల్మిడి గుట్టల్లో మానవ నాగరికత ప్రారంభమైంది.ఇక్కడ లభిస్తున్న వస్తు సంపదను ఇక్కడి ప్రజలు అలంకార ప్రియులు. రుచి కరమైన వంటలు వండుకునే వారు. వ్యవసాయం, పశు పోషణ వీరి వృత్తి. ఎడ్ల బండ్లను వినియోగించారు. జల రవాణా తెలిసిన వారు. విదేశీ వాణిజ్యం చేసిన వారు. నిపుణులైన కుమ్మరులకు, కమ్మరులకు కొదువ లేదని తెలుస్తుంది. పిల్లలు మట్టి గురుగులతోనూ, తొక్కుడు బిళ్ళ వంటి ఆటలు అడు కున్నట్లు తెలుస్తుంది.

శాతవాహనుల కాలంలో భూ మార్గంలో సూర్యాపేట మీదుగా మచిలీ పట్నం ఓడ రేవు చేరి, అక్కడి నుండి జల మార్గంలో రోమ్ సామ్రాజ్యంతో వాణిజ్య సంబంధాలు జరిగినట్లు తెలంగాణలో అనేక చారిత్రక ఆధారాలు లభించాయి. గతంలో నల్గొండ జిల్లా అక్కినేపల్లి లో జరిపిన త్రవ్వకాలలో 1551 రోమన్ నాణాలు లభించాయి.

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామంలో లభించిన మట్టి ముద్ర బర్మా దేశముతో, అక్కడ దొరికిన ఇతర రాతి పూసలను బట్టి ఇతర దేశాలతో సంబంధం ఉన్నట్టు తెలిసింది. ఇప్పుడు వల్మిడిలో లభించిన రోమన్ పాత్రలు, ఇక్కడ తయారైన ఇనుము, ఉక్కు ముద్దలు ఇతర దేశాలకు ఎగుమతి అయినట్లు తెలుస్తున్నది.

#### వల్మిడిలో రాక్షస గూళ్ల సమాధులు:

ఇనుప యుగం రావటంతో రాక్షస గూళ్లు సమాధులు నిర్మించడం మొదలైంది. గుట్ట వెనుక పెద్ద పెద్ద బండలను వలయంగా పేర్చిన సమధులు ఉన్నాయి. వీటిలో ద్వి వలయ రాక్షస గూళ్లు కూడా ఉన్నాయి. పెద్దమ్మ బండపై మూడు డాల్మెన్ సమాధులతో పాటు ఒక స్మారక శిల ఉంది. రాముడి గుట్టపైకి రోడ్డు వేసే క్రమంలో గుట్టపై గతంలో ఉన్న రెండు డోల్మెన్ సమాధులు తొలగించారు.

బౌద్ధ స్థూపాలకి ఉపయోగించే లైమ్ స్టోన్ రాతి ముక్క ఒకటి లభించింది. పాలకుర్తి మండలం లోని గూడూరు లో బౌద్ధ స్తూపం ఉంది. ఇక్కడ స్థూపానికి ఉపయోగించిన రెండు వైపుల పద్మాలు ఉన్నా రాతి ముక్క, సున్నంతో చేసిన బొమ్మల ముక్కలు లభించాయి. గూడూరు పక్కనే వున్న ఇప్పగూడెం లో బుద్దుని శిల్పం, వజ్రయాన బౌద్ధ తార శిల్పం వెలుగు చూశాయి.బమ్మెర లోనూ బౌద్ధ శిల్పాలను చెక్కేటప్పుడు ఊడిపడిన సున్నపు రాతి



పెచ్చులు లభించాయి. వల్మిడికి బౌద్ధంతో సంబంధం ఉన్నట్లు ఇతర బలమైన ఆధారాలు లభించలేదు.

#### వల్మిడి పూర్వపు పేరు గుల్మిడి:

రామాయణం రాసిన వాల్మీకి పేరుతో వల్మిడి అనే గ్రామ నామం స్థిర పడిందని స్థానికులు చెబుతున్నట్లుగా ఆధారాలు ఏమీ లభించలేదు.

శాతవాహనుల కాలంలో ఐదు గ్రామాలను కలిపి "గుల్మి" అంటారు. గుల్మి అధిపతిని గుల్మికుడు అంటారు.వల్మిడి సమీప గ్రామాలలో ఇంత పెద్ద ఎత్తున పాటి కనిపించదు. నాటి గుల్మిడి నేడు వల్మిడిగా ప్రసిద్ధి పొంది వుండవచ్చు. ముందుగా చారిత్రకంగా ప్రాముఖ్యత ఉన్న వల్మిడి పాటి ఉపరితలంలో కనిపిస్తున్న చారిత్రక ఆధారాలను సేకరించాలి. పురావస్తు శాఖ త్రవ్వకాలు జరిపితే మరింత చరిత్ర తెలుస్తుంది. ఇక్కడ బయట పడిన వస్తు సామాగ్రిని భద్రపరిచి, పర్యాటకుల సందర్శన కోసం గుట్టపై ఒక మ్యూజియం నిర్మించాలని రత్నాకర్ రెడ్డి కోరారు.

### జిల్లాలో గంజాయి, మత్తుపదార్థాల

# నిర్మూలనకు పటిష్ట చర్యలు : ఎస్పీ భాస్కర్

**జగిత్యాల మే 27 (ప్రజామంటలు):** గంజాయి అమ్ముతున్న వ్యక్తులను పట్టుకొని వారి నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎస్.ఐ ఉమాసాగర్, ఏఎస్ ఐ ప్రకాష్ లను జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అభినందించి ప్రశంస పత్రాన్ని అంద జేసారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు జిల్లా పోలీస్ యంత్రంగం ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని మండలాల్లో, గ్రామాల్లో నిత్యం తనిఖీలు నిర్వహిస్తు ముందుకు సాగుతుంది అన్నారు. వివిధ జిల్లాల నుండి జిల్లాకు వచ్చే గంజాయి మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో, కళాశాలలో గంజాయి, మత్తు పధార్థాలకు అలవాటు పడకుండా అవగాహన కార్యక్రమాలు నిరహిస్తున్నామని అన్నారు. గంజాయి, మరే ఇతర మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు రవాణా చేస్తున్నట్లు సమాచారం



ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌కి లేదా డయల్ 100కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. నిర్మల్ జిల్లాకి చెందిన శ్రీకాంత్, అజయ్ అనే వ్యక్తులు గంజాయిని ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో వేములకుర్తి గ్రామానికి గంజాయిని అమ్మడానికి వస్తుండగా అక్కడే ఉన్న ఇబ్రహీం పట్నం ఎస్సై ఉమాసాగర్ ఏఎస్ఐ ప్రకాష్ అనుమానం వచ్చి వారిని తనిఖీ చేయగా 368 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. గంజాయి అమ్ముతున్న వ్యక్తు లను పట్టుకొని వారి నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్న ఇబ్రహీంపట్నం ఎస్.ఐ. ఉమాసాగర్, ఏఎస్ఐ ప్రకాష్ ను ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అభినందించి ప్రశంస పత్రాన్ని అందజేశారు.



## క్రీడాకారులకు సన్మానించిన అన్నం అనిల్

**కోరుట్ల టౌన్ మే 27 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ పోటీలలో పాల్గొని విజయం సాధించిన కోరుట్లకు చెందిన క్రీడాకారులను బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు అన్నం అనీల్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర చంద్ర శేఖర్, కోరుట్ల ఎస్ఐ సతీష్, కోరుట్ల పట్టణ బీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి పుప్పాల నాగరాజు అభినందించారు. ఈ సందర్భంగా వారికి మెడల్స్ బహుకరించి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అన్నం అనీల్ మాట్లాడుతూ.... క్రీడాకారులు ఇదే విధంగా అన్ని పోటీలలో రాణించాలని మన కోరుట్లకు పేరు తీసుకురావాలని, క్రీడాకారుల కోసం అన్నివిధాల సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పి ఈ టి లు వెంకట్ రెడ్డి గంగాధర్ చిలుక లక్ష్మీనారాయణ కోరుట్ల మండలం వాలీబాల్ సెక్రెటరీ ఎమ్.ఎ. బారి, కోరుట్ల మండల హ్యాండ్బాల్ ప్రెసిడెంట్ గిన్నెల విద్యాసాగర్, సెక్రెటరీ పెద్ద బోయిని శ్రీనివాస్ మరియు సీనియర్ క్రీడాకారులు బొద్దురి హెరాల్డ్, కోచ్ గౌటీ శ్రీనివాస్, కరాటే కోచ్ కొక్కుల రాజేష్, పీఈటీలు గౌటి రవీందర్, వాసాల రాజు, వాసం నవీన్ కుమార్, బి. శ్యాం మరియు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజ్ పనులు వేగవంతం చేయాలి

**జనగామ మే 27 (ప్రజామంటలు):** హైదరాబాదు నుండి మెడికల్ అండ్ హెల్త్ సెక్రెటరీ రిజ్వి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, రాష్ట్రంలో నూతన మెడికల్ కాలేజీలల్లో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతున్న పనులపై సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



నిర్వహిం(చారు. ఈ సందర్భంగా రజ్వీ, రమేశ్ రెడ్డి, మాట్లాడుతూ.... జిల్లాలో మెడికల్ కాలేజీలో వచ్చే తరగతుల ప్రారంభం కానున నేపథ్యంలో ఇప్పటికే సూచించిన పనులను నిర్మాణము, వసతులు కల్పన మెడికల్ ఇంజనీరింగ్ సిబ్బంది తో కలిసి త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత జిల్లా కలెక్టర్ల ద్వారా తెలియపరచాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. గోపాలరావు, సంబంధిత వైద్య అధికారుల తో కలిసి జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య మాట్లాడుతూ.... జిల్లాలో ఇప్పటికే మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం అన్ని ఏర్పాట్లు చేసామని తాత్కాలిక వసతి కోసం హాస్టల్ తరగతి గదులు ల్యాబ్ నిర్వహణ కోసం ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశామని సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపాలరావు, ఏరియా హాస్పిటల్ సూపరిటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రశాంత్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్ డాక్టర్ అశోక్ వైద్య కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాల

## సన్నాహక సమావేశం

**కోరుట్ల టౌన్ మే 27 (ప్రజామంటలు):** మే 30 నుండి జూన్ 30 వరకు భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ కార్యవర్గ సమావేశం స్థానిక కావేరి గార్డెన్లో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ యువ నాయకులు సురభి నవీన్ కుమార్ పాల్గొని నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 30-2023 నాటికి తొమ్మిది సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకోవడం మనందరికీ గర్వకారణం ఈసందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో జన్ సంపర్క్ అభియాన్ కింద ప్రతి ఒక్క కార్యకర్త 20 మందిని కలిసి పేద ప్రజలకొరకు మోడీ ప్రవేశ పెట్టిన పథకాలు ప్రతి ఒక్కరి వద్దకు చేరుకునే విదంగా జిల్లాలు, మండలాలు, శక్తి కేంద్రాలు, పోలింగ్ బూత్ లలో మే 30 నుండి జూన్ 30 వరకు కార్యచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సుధవేణి మహేష్ పట్టణ ప్రధాన కార్యదర్శి మోలుమూరి రాజమురళి,



కౌన్సిలర్ లు మాడవేణి నరేష్, సీనియర్ నాయకులు దాసరి రాజ శేఖర్, తిరుమల వాసు,బండారి వెంకటి, మ్యాదరి రాజేష్, ఎస్సి మోర్చా రాష్ట్ర నాయకులు సోరుపాక రమేష్, ఈశ్వర్ నగర్ సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారామ్, కలాల సాయి చందు బీజేవైఎం జిల్లా కార్యదర్శి సడిగే మహేష్ ఉపాధ్యక్షులు, గందె నవీన్, కంటం ఉదయ్, నారాయణ రెడ్డి, వడ్లకొండ శ్రీనివాస్, గుద్దేటి రాజేందర్, తోట రాజేశం, నల్ల రాజకుమార్, ఎర్ర రాజేందర్, ఇట్యాల నవీన్, ఎంపి అక్మాల్, గుంటుక నాగరాజు, చాంద్ పాషా, నారావేణి అశోక్, చొప్పరి గంగాధర్ గోనె వినయ్, అడమానపెల్లి సాయి, కంఠం శ్రీనివాస్, దామ శ్రవణ్, ఎస్టి మోర్చా అధ్యక్షులు అంజి, ఓం ప్రకాష్, కస్తూరి కళాదర్, వెంకట సాయి, మొదలగు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను

# ఘనంగా నిర్వహిస్తూ విజయవంతం చేయాలి

**జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్**

**జగిత్యాల మే 27 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జూన్ 2 నుంచి 22 వరకు మూడు వారాల పాటు సాగే ఈ ఉత్సవాలు జిల్లా లో ఘనంగా జరపాలని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలకు సంబంధించి జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీస్ శాఖ పరంగా చేయవలసిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 2వ తేదీ నుండి 22వ తేదీ వరకు మూడు వారాల పాటు సాగే " తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల" జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తూ విజయవంతం చేయాలని ఎలాంటి సంఘటనలు జరగకుండా ఈ యొక్క మూడు వారాల పాటు భద్రత పరమైన ఏర్పాట్లను చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ శాఖ నిర్వహించే సురక్ష దినోత్సవం మరియు తెలంగాణ రన్ కార్యక్రమాలను విజయవంతం అయ్యేలా కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు.

**జూన్ 4వ తేదీ ఆదివారం "సురక్షా దినోత్సవం" :**

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని, స్నేహపూర్వక విధానాన్ని, సమర్థవంతమైన సేవలను వివరించే



విధంగా కార్యక్రమాలు ఉండాలని ఆదేవిదంగా పోలీసుశాఖలో జరిగిన సంస్కరణలను, వాటి విశిష్టతను సభల ద్వారా, కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేయాలి. పోలీసుశాఖ సాధించిన ఘనతలను, విజయాలను ప్రజలకు తెలియజేసే కార్యక్రమాలను చేపట్టాలి. పోలీస్ జాగృతి కళాకారుల బృందాలతో ప్రదర్శనలు. పోలీసులు వాడుతున్న అధునాతన సాంకేతిక అంశాలు, పోలీస్ జాగిలాలు వివిధ నైపుణ్యాల గురించి ప్రదర్శన, పెట్రోలింగ్ కార్స్, బ్లూ కోల్ట్స్, వెహికిల్స్ తోర్యాలీ నిర్వహించాలి. జూన్ 12వ తేదీ సోమవారం తెలంగాణ రన్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్నీ నియోజకవర్గ కేంద్రాల్లో పోలీసు శాఖ నేతృత్వంలో యువకులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులతో ఉదయం 6 గంటలకు తెలంగాణ రన్ కార్యక్రమం నిర్వహించాలి క్రీడలు, యువజన సర్వీసులశాఖ వారితో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ఈ యొక్క కార్యక్రమంలో డిఎస్పీలు ప్రకాష్, రవీంద్రారెడ్డి రవీంద్ర కుమార్, ఎస్బీ, డిసిఆర్బి, ఐటి కోర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్లు రాజశేఖర్ రాజు, శ్రీనివాస్, సరిలాల్, నాగేశ్వరరావు మరియు సి.ఐ. లు కోటేశ్వర్, ప్రవీణ్ లక్ష్మీనారాయణ, రమణమూర్తి ఆర్.ఐ. లు వామనమూర్తి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించాలి

**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు**

**ధర్మపురి మే 27 (ప్రజామంటలు):** మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రోజున మున్సిపల్ కమిషనర్ ను కలిసి ధర్మపురిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ప్రారంభించాలని, కరెంట్ కోతలను ఆపాలని, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. అంతకు ముందు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మార్కెట్ లో చిరు వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను నిర్మాణం చేసి ఇప్పటికి ఆరు నెలలు గడుస్తున్న ప్రారంభోత్సవానికి మాత్రం నోచుకోవడం లేదని, చిరు వ్యాపారులు ఇంతటి ఎండలో వ్యాపారం చేసుకుంటూ నీళ్ల వసతి లేక బాత్రూమ్ వసతి లేక నానా ఇబ్బందులు పడుతున్నారని దీనికి మంత్రి కొప్పుల ఈశ్వర్ గారు ఏం సమాధానం చెప్తారని, తలాపున గోదావరి ఉన్నప్పటికీ ఒక మంత్రి హోదాలో ఉన్న కొప్పుల ఈశ్వర్ ఇక్కడి ప్రజలకు నీటి కష్టాలను మాత్రం దూరం చెయ్యలేక పోతున్నారని, కేవలం



ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్ల కోసం ప్రారంభోత్సవాలు చెయ్యడం తప్ప ప్రజల గురించి ఎప్పుడు ఆలోచించింది లేదని, ఇక్కడి మంత్రి, ప్రజాప్రతినిధులతో సహా అందరు అధికార పార్టీ కి చెందిన వారేనని కాని ఇక్కడ వ్యాపారం చేసుకోవడానికి మాత్రం వ్యాపారస్తులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, వెంటనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ని ప్రారంభించి ఇక్కడ వ్యాపారం చేసుకునే వ్యాపారస్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, అదేవిధంగా కరెంటు కోతలకు కూడా శాశ్వత పరిష్కారం చూపించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంఘన భట్ల దినేష్, ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింహారాజు ప్రసాద్, ధర్మపురి మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాందెని మొగిలి, ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ, కస్తూరి శ్రీనివాస్, రఫియొద్దిన్, స్తంభం కాడి గణేష్, ఇఫ్తికర్, పట్టణ కాంగ్రెస్ ఎస్సి సెల్ అధ్యక్షులు పోచయ్య, మల్లేశం, ప్రశాంత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆన్లైన్ క్విజ్ పోటీలో యువత చురుగ్గా పాల్గొనాలి

**ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ పోస్టర్ ఆవిష్కరణ**

**మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి**

**భీమదేవరపల్లి మే 27 (ప్రజామంటలు):** కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ పోటీలో యువకులు చురుగ్గా పాల్గొనాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి అన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో ఎన్ఎస్ యూఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

ఎన్ఎస్ యూఐ నాయకులు సనత్ రెడ్డి ఆధ్వర్యంలో కోహెడ మండలానికి చెందిన పలువురు యువకులు ప్రవీణ్ రెడ్డి సమక్షంలో ఎన్ఎస్ యూఐ లో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన మాజీ ప్రధాని రాజీవ్





గాంధీ ఆశయాలను యువతకు తెలియజేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ పోటీల్లో యువకులు చురుగ్గా పాల్గొనాలని యువతకు పిలుపునిచ్చారు. వివరాలకు 7661899899 అనే నంబరు కు మిస్డ్ కాల్ ఇస్తే మొబైల్ కు ఒక లింక్ వస్తుందని, ఆ లింక్ ద్వారా వివరాలు నమోదు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అజయ్ రెడ్డి, అరవింద చారి, రంజిత్ రెడ్డి, కార్తిక్, వివేక్ రెడ్డి, రమేష్, రాకేష్, అరవింద్, ధనుష్, శ్రీధర్, ప్రశాంత్, బి. ప్రశాంత్, దినేష్, మహేష్, విష్ణు, అజయ్, నితిన్ రెడ్డి, హర్ష వర్ధన్, శివ ప్రసాద్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, హనుమత్ రెడ్డి, ఆదర్శ్, సాయి కుమార్, అజయ్ కుమార్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ గ్రానైట్ మైనింగ్ లీజును వెంటనే రద్దు చేయాలి : బక్క జడ్సన్

**స్థానిక గ్రామ ప్రజలతో రాష్ట్ర మైనింగ్ ద కార్యాలయం ముందు నిరసన ధర్నా**

**గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లీజుకు**

**మైనింగ్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు**

**ధర్మసాగర్, మే 27 (ప్రజామంటలు):** మండలంలోని నారాయణ గిరిలో గ్రానైట్ మైనింగ్ కు ప్రభుత్వ భూమిని దొడ్డి దారిన వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి తనయుడికి గ్రామంలోని సర్వే నం. 609 లో "శ్రేయ ఎక్స్పోర్ట్ మరియు శ్రీమాన్ రాక్స్" అను కంపెనీల కు కలర్ గ్రానైట్ నిక్షేపాలున్న మైనింగ్ కు 2021 లో దరఖాస్తు చేసుకున్న వీరికి 30 హెక్టార్లు (75 ఎకరాలు) లో గ్రానైట్ మైనింగ్ లీజు 20 ఏండ్లకు దొడ్డి దారిన మంత్రి కేటీఆర్ అండతో అక్రమంగా ఇవ్వడాన్ని తీవ్రకంగా వ్యతిరేకిస్తూ శనివారం ఏఐసీసీ సభ్యులు, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ ఆధ్వర్యంలో



హైదరాబాద్ లోని రాష్ట్ర మైనింగ్ కార్యాలయం ముందు నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం మైనింగ్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసారు. తక్షణమే హన్మకొండ జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ను పిలిపించి మాట్లాడతానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా బక్క జడ్సన్ మాట్లాడుతూ, గతంలో రాష్ట్రంలోని సుమారు 90 అక్రమ మైనింగ్ లపై ఫిర్యాదు చేసానని అన్నారు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నారాయణగిరిలోని అక్రమ మైనింగ్ పై ఉద్యమి స్తామని, స్థానికంగా చుట్టుపక్కల ఉన్న చెరువులు, కుంటలపై ఆధారపడి బ్రతికే మత్స్యకారుల ఉపాధి కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్వారీ వల్ల 50 వేల చెట్లు మొక్కలకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. గ్రామంలోని స్థానిక ప్రజలకు సమాచారం ఇవ్వకుండా, గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లీజుకు ఇచ్చారని ఆరోపించారు.

# ఆధునిక పరిస్థితులలో

## మెడిటేషన్, యోగ ఆవశ్యకత ఎంతైనా ఉంది



**ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**జగిత్యాల మే 27 (ప్రజామంటలు):** శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నేస్ వారి అధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండల పొలాస గ్రామంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల లో మూడు రోజులపాటు నిర్వహించిన ధ్యాన-యోగ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హార్ట్ ఫుల్ నెస్ ట్రైనర్, కార్యక్రమం నిర్వాహకులు మంచాల కృష్ణ, కళాశాల అసోసియేట్ డీన్ డా. భారతి నారాయణ్ భట్,రెడ్ క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్,కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్, ట్రైనర్స్ సుధాకర్ పాల్గొని, మెడిటేషన్, యోగ, బ్రైండ్ ఫుల్ నెస్ తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మాట్లాడుతూ.... ప్రస్తుత ఆధునిక పరిస్థితులలో మానవ జీవితంలో మెడిటేషన్, యోగ ఒక భాగం కావాలసిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. గతంలో తనకు వెన్ను సమస్య వచ్చినప్పుడు, అందరూ ఆపరేషన్ ఒక్కటే మార్గమని సూచించారని, ఐతే తన మిత్రులు సూచించిన యోగ ద్వారా కొంత ఉపశమనం పొందానని అన్నారు. విద్యార్థులు మెడిటేషన్, యోగకు కొంత సమయం కేటాయించడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, మానసిక ప్రశాంతతతో పాటుగా ఏకాగ్రత పొందుతారని అన్నారు.

ఈ ముగింపు కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, మాజీ సర్పంచ్ నరేష్, రాయికల్ సింగిల్ విండో ఛైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, డైరెక్టర్ పోచమల్లు మరియు సురేష్, అనిల్, రామిడీ జగన్, రవి చంద్, రామ్ శంకర్, ఉప సర్పంచ్ మహేష్, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

## చెన్నవిశ్వనాథం, వెన్న సురేష్ సుతారి రాములు డిమాండ్

**కోరుట్ల టౌన్ మే 27 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణంలోని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర నేతలు చెన్న విశ్వనాథం వెన్న సురేష్ సుతారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రోజున భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో అర్హులైన నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలని, అల్లమయ్య గుట్ట ప్రాంతంలోని రారాజు ఫంక్షన్ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర నేతలు మాట్లాడుతూ పట్టణ శివారులోని సర్వే నెంబరు 443, 444,




445, లలో ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని అర్హులైన పేదవారికి, ఇండ్ల స్థలాలు ఇచ్చి నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ భూములను సర్వే చేసి పేదలకు పట్టాలను ఇవ్వాలని కేబినెట్లో, నిర్ణయిస్తూ అధికారులకు సూచించారని వివరించారు. అట్టి సూచన మేరకు రెవెన్యూ సిబ్బంది దృష్టికి ఈ భూములను ఉన్నట్టు ఆ స్థలం లో ఎర్రజెండా పాతి నామని పేర్కొన్నారు. వెంటనే స్పందించని ఎడల ఆ స్థలంలో గుడిసెలు వేస్తామన్నారు. ఫంక్షన్ హాల్ నుండి ర్యాలీ నిర్వహించి ఆ స్థలం వరకు వెళ్లి చదును చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నేతలు ఎన్న%శీ% రాధ, రామిల్ల రాంబాబు. సాంబార్ మహేష్, చాంద్ పాషా, గుండేటి పోశెట్టి, దాసరి మనోహర్, అందే వంశీకృష్ణ, మ్యాదరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తూకంలో మోసం, తూకం యంత్రం పరిశీలన

## ఇంచార్జులను మందలించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**సారంగాపూర్ మే 27 (ప్రజామంటలు):** మండల బట్టపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో సెంటర్ ఇంఛార్జి లు ధాన్యం తూకం లో రైతులను మోసం చేయటం గూర్చి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ దృష్టికి స్థానిక రైతులు తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తూకం



యంత్రాన్ని పరిశీలించి, ఇంచార్జులని మందలించి, డిసిఓ కుఇట్టి విషయాన్ని ఫోన్ లో తెలిపి తూకం లో మోసం చేసిన వారిపై చర్యలు తీసుకొని రైతులను న్యాయం చేయాలని కోరారు. రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులకు అండగా ఉందని,దేశంలో ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం సేకరణ ఎక్కడా జరగడం లేదని అన్నారు.తూకం లో మోసం చాలా బాధాకరం అని మోసం చేసే వారిపై చర్యలు ఉంటాయని,రైతులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. తూర్పార పట్టిన ధాన్యం విషయంలో కటింగ్ చేస్తే ఉపేక్షించేది లేదని, వ్యవసాయ అధికారి సర్టిఫై చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులు కు పంపాలని కోరారు. రైతు పక్షపాతి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని జగిత్యాల జిల్లాలో 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 537 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశామని, దాదాపు 200 కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయని అన్నారు. వెంట కేడిసిసి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామ్ చందర్ రావు, జిల్లా రైతు బందు సమితి సభ్యులు కోలుముల రమణ, పాక్స్ చైర్మన్ నరసింహ రెడ్డి, సర్పంచ్ లక్ష్మి ప్రేమానందం, కోల నరసింహ రెడ్డి, సాయిలు, మధుకర్, తదితరులు ఉన్నారు.



# క్వారీ వద్దు, పర్యావరణమే ముద్దు

## నారాయణగిరిలో క్వారీకి వ్యతిరేకంగా గ్రామస్తుల ధర్నా

**ధర్మసాగర్ మే 27 (ప్రజామంటలు):** మండలంలోని నారాయణగిరి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇవ్వద్దని గ్రామస్తులు శనివారం గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న గ్రామస్తులు క్వారీ వద్దు.. పర్యావరణమే ముద్దు, నారాయణగిరి గ్రామ చరిత్రను కాపాడుకోవాలి. క్వారీకి అనుమతులు ఇవ్వద్దు, అక్రమ మైనింగ్ ను వెంటనే రద్దు చేయాలి, అనే నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నారాయణగిరి గ్రామంలోని నడిమిబోడుకు గ్రానైట్ తవ్వకాలకు అనుమతి కోరుతూ గ్రామస్తులకు ఎవరికి తెలియకుండా గ్రామంలో ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కాలుష్య నియంత్రణ బోర్డు జిల్లా అధికారి సునీత గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని నిర్వహించారని అన్నారు. అయితే ఈ ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు, రైతులు ఎవరు పాల్గొనలేదని అన్నారు. అత్యంత పురాతన చరిత్ర ఆనవాళు కలిగిన నడిమిబోడు గుట్టను మైనింగ్ కు కేటాయించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రాచీన కాలంలో జైన మతస్తులు, బౌద్ధమత గురువులు ఈ గుట్టపై నివాసం ఏర్పాటు చేసుకుని జీవించిన ఆనవాళ్లు గుర్తులు విగ్రహాలు ఉన్నాయని తెలిపారు.

పురాతన చరిత్ర కలిగిన నడిమిబోడు గుట్టను మైనింగ్‌కి అప్పగించి గ్రామ సంపదను కొల్లగొట్టడం సరికాదని డిమాండ్ చేశారు. ఈ గుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకట్రాజం, మాజీ సర్పంచ్ బొగ్గుల వెంకటస్వామి, గ్రామ రైతు కోఆర్డినేటర్ కదారి రమేష్, రైతులు పుట్ట ప్రకాష్, మాచర్ల సాంబరాజు, యువకులు దాసరి రాజకుమార్, రవి ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# తమన్‌కి బ్యాడ్ టైమ్ స్టార్ట్ అయ్యిందా?

ప్రస్తుతం టాలీవుడ్‌లోనే కాకుండా సౌత్ లో టాప్ మ్యూజిక్ డైరెక్టర్‌గా తమన్ పేరు మారు మ్రోగిపోతుంది. అలాంటి తమన్ కు గట్టి షాక్ తగిలిందా అంటే ఔను అనే సమాధానం విని పిస్తుంది. సోషల్ మీడియాలో తమన్ గురించి ప్రస్తుతం రకరకాలుగా పుకార్లు షికార్లు చేస్తూ ఉన్నాయి. ఆ పుకార్లు తమన్ అభిమానులకు ఆందోళన కలిగిస్తున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ప్రస్తుతం మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా యొక్క సంగీత దర్శకుడిగా తమన్ ను ఎంపిక చేయడం జరిగింది. అయితే త్వరలో విడుదల కాబోతున్న ఫస్ట్ లుక్ పోస్టర్ మరియు గ్లిమ్స్ కు సంబంధించిన ప్రీ పోస్టర్ లో థమన్ పేరు లేకపోవడతో అంతా కూడా షాక్ అవుతున్నారు. ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ను బట్టి మహేష్ బాబు.. త్రివిక్రమ్ కాంబో సినిమా నుండి తమన్ ను తొలగించారట. రెండు రోజుల్లో రాబోతున్న గ్లిమ్స్ లో థమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వినిపించబోతుంది. కానీ సినిమాలో మాత్రం తమన్



సంగీతం వినిపించక పోవచ్చు అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. తమన్ యొక్క వర్క్ విషయంలో మహేష్ బాబు మరియు త్రివిక్రమ్ అసంతృప్తిగా ఉన్నారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలు విషయం ఏంటి అనేది తెలియాల్సి ఉంది. ఒక వేళ నిజంగానే మహేష్ బాబు సినిమా నుండి తమన్ ను తప్పిస్తే ఇక నుండి ఆయనకు బ్యాడ్ టైమ్ స్టార్ట్ అయినట్లే అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

# దసరాకు ముందే రానున్న రామ్ సినిమా

రామ్ హీరోగా ప్రస్తుతం తన తొలి పాన్ ఇండియా చిత్రంలో నటిస్తున్నారు. బోయపాటి శ్రీను దర్శకుడు. జీ స్టూడియోస్, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్స్ పతాకంపై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. శ్రీలీల నాయికగా నటిస్తున్నది. ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. ఈ సినిమా ముందస్తు షెడ్యూల్ ప్రకారం దసరా పండుగకు అక్టోబర్ 20న విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే తాజా సమాచారం ప్రకారం మరో నెల ముందుగానే అంటే సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు



తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారట. సినిమా పనులు తుది దశకు చేరడంతో అప్పటిదాకా వేచి చూడటం ఎందుకనేది చిత్రబృందం ఆలోచనగా కనిపిస్తున్నది. అయితే ఈ విషయంలో అధికారిక ప్రకటన రాలేదు. ఈ సినిమా మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్నది. ఇటీవలే రామ్ పుట్టినరోజుకు విడుదల చేసిన ఫస్ట్ థండర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. హిందీతో పాటు దక్షిణాది భాషల్లో ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు.

# ప్రాణం ఖరీదు డైరెక్టర్ వాసు మృతి

## పలువురు సినీ ప్రముఖుల సంతాపం

తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన సీనియర్ దర్శకుడు,రచయిత అయిన కె. వాసు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. దర్శకుడిగా 1974వ సంవత్సరంలో కెరీర్ ప్రారంభించిన కె. వాసు మొదటి చిత్రం 'ఆడపిల్లల తండ్రి'. ఆ తర్వాత ఆయన చేసిన 'ప్రాణం ఖరీదు' చిత్రంతో మెగాస్టార్ చిరంజీవి నటుడిగా అరంగేట్రం చేశారు. కె. వాసుది కృష్ణాజిల్లాలోని ముదునూరు. వాసు తండ్రి ప్రత్యగాత్మ అలాగే బాబాయి హేమాంబరధరరావు కూడా దర్శకులే. కె. వాసు మృతితో మరోసారి చిత్ర పరిశ్రమలో



విషాదం నెలకొంది. ఇటీవలే నటుడు శరత్ బాబు మృతి చెందిన విషయం తెలిసిందే. దర్శకుడిగా కె. వాసు.. 'కోతల రాయుడు, గోపాలరావుగారి అమ్మాయి, ఆరని మంటలు, దేవుడు మావయ్య, తోడుదొంగలు, అల్లుళ్లొస్తున్నారు, అమెరికా అల్లుడు, శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం, డామిట్ కథ అడ్డం తిరిగింది, ఆడ పిల్ల, జోకర్ మామ సూపర్ అల్లుడు, రేపటి రౌడీ, ఇంట్లో శ్రీమతి వీధిలో కుమారి' వంటి ఎన్నో చిత్రాలను డైరెక్ట్ చేశారు. ఆయన చివరిగా దర్శకత్వం వహించిన చిత్రం 2008లో వచ్చిన 'గజిబిజి'. మెగాస్టార్ చిరంజీవితో ఆయన ఎక్కువగా సినిమాలు చేశారు. కె. వాసు మృతి విషయం తెలిసిన పలువురు ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పిస్తూ.. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నారు. దర్శకులు కె.వాసుగారు కన్నుమూశారని తెలిసి నటుడు పవన్ కళ్యాణ్ చింతించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. అన్నయ్య చిరంజీవి ముఖ్య పాత్రలో నటించిన ప్రాణం ఖరీదు సినిమా దర్శకులుగా వాసుగారిని మరచిపోలేం.

చిరంజీవిగారు తొలిసారి వెండితెరపై కనిపించింది ఆ సినిమాతోనే. వినోదాత్మక కథలే కాకుండా భావోద్వేగ అంశాలను తెరకెక్కించారు. కె.వాసు సినిమాల్లో శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం ప్రత్యేకమైనది. తెలుగునాట షిర్డీ సాయిబాబా చరిత్ర ప్రాచుర్యం పొందటంలో ఆ సినిమా ఓ ముఖ్య కారణమైంది. వాసు గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తు న్నానని అన్నారు.



## బయటపడ్డ బాయ్‌ఫ్రెండ్‌తో సహజీవనం వ్యవహారం

ప్రస్తుతం హీరోయిన్ డింపుల్ హయాతి పేరు ఇటు ఇండస్ట్రీలో, అటు మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. పార్కింగ్ విషయంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డేతో జరిగిన వివాదంతో కొన్నిరోజులుగా వార్తల్లో నిలుస్తోంది డింపుల్. ఈ వ్యవహారంతో డింపుల్ చాలా అప్‌సెట్ అయినట్లు తెలుస్తుంది. కనీసం బయటకు రావడానికి కూడా ఇష్టపడటం లేదని స్వయంగా డింపుల్ తరుపు న్యాయవాది పేర్కొన్న సంగతి తెలిసిందే. అసలే వరుస డిజాస్టర్లతో ఫుల్ డిజపాయింట్ లో ఉన్న డింపుల్.. తాజా ఇష్యూతో మరింత అప్సెట్ అయ్యిందట. అంతేకాదు, ఇష్యూ కారణంగా తన బాయ్ ఫ్రెండ్ మ్యాటర్ బయటకు వచ్చిందని ఫీలవుతుందట. విక్టర్ డేవిడ్ అనే వ్యక్తితో డింపుల్ కొంతకాలంగా సహజీవనం చేస్తుంది. చాలా కాలంగా ఇద్దరూ ఒకే ఇంట్లో కలిసుంటున్నారు. కానీ ఇన్నిరోజులు ఈ విషయం ఎవరికి తెలియకుండా జాగ్రత్తపడ్డారు. కానీ.. డీసీపీతో జరిగిన గొడవలో డింపుల్ బాయ్‌ఫ్రెండ్ మ్యాటర్ లీక్ అయ్యింది. ఇప్పుడు ఇదే విషయంపై డింపుల్ చాలా అసహనంగా ఉందట.ఇక డింపుల్ హయతి, విక్టర్ డేవిడ్ ఇద్దరి స్వస్థలం విజయవాడ అని సమాచారం. అతను గ్రాఫిక్ డిజైనర్ ఉన్నాడు. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య కలిగిన స్నేహం ప్రేమగా మారి.. ఇప్పుడు లివింగ్ రిలేషన్‌లో ఉంటున్నారు.

**పార్కింగ్ గొడవతో..ఇబ్బందుల్లో డింపుల్ హయతి**

# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అనుష్కశర్మ

ఫ్రాన్స్ వేదికగా 76వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా కొనసాగుతోంది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన సినీ తారలు, మోడళ్లు, డిజైనర్లు, పలువురు సెలబ్రిటీలు పాల్గొని విభిన్న ఫ్యాషన్ దుస్తుల్లో రెడ్ కార్పెట్ పై హొళయలు పోతున్నారు. నెల 16వ తేదీన ప్రారంభమైన కేన్స్ 2023 ఫిల్మ్ ఫెస్టివల్ చివరి దశకు చేరుకుంది. ఇక చివరిరోజు బాలీవుడ్ స్టార్ నటి అనుష్క శర్మ పాల్గొని సందడి చేశారు. ఫ్లవర్ షేప్‌లో ఉన్న వైట్ డ్రెస్‌లో రెడ్ కార్పెట్‌పై హొళయలు పోతూ ఫొటోలకు ఫోజులిచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. పది రోజుల పాటు అట్టహాసంగా కొనసాగిన ఈ వేడుక శనివారంతో ముగిసింది. ఫిల్మ్ అవార్డుల్లో మన తారలు ఇంటర్నేషనల్



ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్–2023 వేడుక యూఏఈ రాజధాని అబుదాబిలో ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకల్లో పలువురు బాలీవుడ్ తారలు పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్–2023 వేడుక యూఏఈ రాజధాని అబుదాబిలో ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకల్లో పలువురు బాలీవుడ్ తారలు పాల్గొన్నారు. ల్మాన్ ఖాన్, అభిషేక్ బచ్చన్, విక్కీ కౌశల్, కృతి సనన్, ఊర్వశి రౌతెలా, రకుల్ ప్రీత్ సింగ్, ఈషా గుప్తా, నోరా ఫతేహీ, డిజైనర్ మనీశ్ మల్హోత్ర తదితరులు హాజరై సందడి చేశారు. వేడుకలో భాగంగా శుక్రవారం రాత్రి విభిన్న ఫ్యాషన్ దుస్తుల్లో గ్రీన్ కార్పెట్‌పై హొళయలుపోయారు. ఇందుకు సంబంధించిన చిత్రాలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

PRINTED AND PUBLISHED BY VNARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206, PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com